ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

ఆదివారం 21 జూన్ 2026 | సంపుటి: 1 సంచిక: 4 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar Adilabad

### శాంతి ఒప్పందం వేళ

## మళ్లీ పీటముడి

### హర్మూజ్ మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన

అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది.

టెహ్రాన్, జూన్ 20 (సింగిడి)



2



## పీఎం కిసాన్ నిధులు విడుదల

రూ. 2,000 చొప్పున 18,880 కోట్లు జమ

హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

2

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ



## ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక

- పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం
- వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి
- వ్యాధి చికిత్స కంటే నివారణే మిన్న
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు.**

**- హైదరాబాద్, జూన్ 20 (సింగిడి)**

ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత ...మిగతా 2లో

## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

### 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు

- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



2



## మెట్రో కోసం రైల్వే మంత్రిని కలుద్దాం

### 22, 23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సీఎం

- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్

హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్–2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

2

**- హైదరాబాద్, జూన్ 20 (సింగిడి)**

### ఆత్మవిశ్వాసంతో పరీక్షకు

## హాజరుకండి



- ఒత్తిడికి గురికావద్దన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు

2



### ముందు మూసీ నిర్వాసితులకు

## న్యాయం చేయండి

ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్

2

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

### ఒడిషాలో ₹47 వేల కోట్లతో

## అభివృద్ధి పనులు

### రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

**భువనేశ్వర్,జూన్ 20 (సింగిడి):**

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ ...మిగతా 2లో



## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

### లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

- హైడ్రాపై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జూన్ 20 (సింగిడి):**

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు.



2



### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## జన్మదినోత్సవం

ఎక్స్ వేదికగా చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు

2

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు


శ్రీరాముడి చిత్రంపై చెప్పు నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

2

### ప్రక్షాళన చేపట్టడమే

## సర్ ప్రధాన ఉద్దేశ్యం

### ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు



- చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు
- ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 20 (సింగిడి):**

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు.

2

## దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

### యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్

- ఉండవల్లి గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజినరీ నేత: బాబా రాందేవ్

2

**అమరావతి,జూన్ 20 (సింగిడి):**

దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు.






### నీట్ అడ్మిట్ కార్డుల్లో

## లోపాలు

మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్ ఖంగుతిని ఎటిఎకు సమాచారం పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్ కు హామీ

2

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
21 జూన్ 2026

# ఒడిషాలో ₹47 వేల కోట్లతో అభివృద్ధి పనులు


మొదటి పేజీ తరువాయి

సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక



అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్బ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజా స్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్



ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాండ్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణేలి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా లేదా పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినోత్సవం

## ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు

**అమరావతి,జూన్20 (సింగిడి):**



శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్ము అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్సలో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఎఖీఉఅ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

**హైదరాబాద్,జూన్ 20(సింగిడి):**

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకు ముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.



# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

**న్యూఢిల్లీ, జూన్ 20 (సింగిడి):**

నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పుర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్లు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

# ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

**ఢాకా, జూన్ 20 (సింగిడి):**

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరుకండి

**హైదరాబాద్,జూన్20 (సింగిడి):**

నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

**హైదరాబాద్, జూన్ 20 (సింగిడి)**

రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

# మెట్రో కోసం రైల్వే మంత్రిని కలుద్దాం

జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్ కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబం ధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

**కోల్‌కతా,జూన్ 20 (సింగిడి):**

పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# ముందు మూసీ నిర్వాసితులకు న్యాయం చేయండి

## ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్,జూన్ 20 (సింగిడి):**

మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి.ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదరణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్లు హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభాతవర్ణ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 21-6-2026

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సేవలు

- నిస్వార్ధంగా సేవ చేయడమే వాసవి క్లబ్ లక్ష్యం
- వాసవీ క్లబ్ అధ్యక్షుడు గుడివాడ వెంకట సతీష్



**జమ్మికుంట, జూన్ 20 (సింగిడి):** జమ్మికుంట వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ ఉదయాస్తమాన సేవలలో భాగంగా శనివారం జమ్మికుంటలో వివిధ సేవా కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షుడు గుడివాడ వెంకట సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాస్తమాన సేవలో భాగంగా పట్టణంలోని బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో ఒక సిమెంట్ బెంచ్ అయ్యప్ప స్వామి దేవాలయంలో గోవులకు గ్రాసం నీళ్ల తొట్టి సాయి మానసిక వికలాంగుల పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ వారికి నిత్యావసర వంట సరుకులు జమ్మికుంట ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రతిభ వంతులైన విద్యార్థుల సన్మానం కొరకు శాలువాలు అందించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇవే కాకుండా సహాయసేవలో భాగంగా ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నెంబర్స్ లిస్టులను ప్రధాన కూడలిలో అతికించడం జరిగిందని దీని ద్వారా ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు ఎవరికి ఫోన్ చేయాలో అన్న విషయంలో బాధితులకు ఒక స్పష్టత వస్తుందని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా బ్లడ్ డోనర్స్ నెంబర్స్ బ్లడ్ గ్రూప్ వారి పేరు రాసి ఫ్లెక్సీలు పలుచోట్ల అతికించడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా పిప్పళ్ల విశ్వేశ్వరరావు ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రెసిడెంట్ మల్లికార్జున గెస్ట్ ఆఫ్ హానర్ గంప సురేందర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామిని శ్రీనివాస్ రీజియన్ వైస్ పర్సన్ అయిలు రమేష్ జోన్ చైర్ పర్సన్ వైస్ గవర్నర్ తంగళ్లపల్లి రాజా భాస్కర్ గో సేవా ఇంచార్జ్ రావి కంటి నీలకంఠం జిల్లా భాద్యులు లెంకలపల్లి శరత్ కుమార్ అయిత సుధాకర్ వ్యాసాని రమేష్ జమ్మికుంట వాసవి క్లబ్ అధ్యక్షులు గుడివాడ వెంకట సతీష్ ప్రధాన కార్యదర్శి రేణికుంట రాజు కోశాధికారి అయితు శ్రీనివాస్ వాసవి క్లబ్ సభ్యులు యాద శ్రీధర్ కొండ్లె నగేష్ యాంసాని శ్రీనివాస్ మాజేటి వెంకటేష్ సూధం సత్యం చిదిరాల శ్రీనివాస్ ముక్క వేణు కాసం నాగరాజు మంచాల రాంబాబు తంగళ్లపల్లి శ్యామ్ కిషోర్ కంభం పాటి శివకుమార్ కోనేటి శివానందయ్య చికిలే జయప్రకాష్ అయిత భా స్కర్ స్వామిరెడ్డి రాజేందర్ అయిత సత్యనారాయణ రావి కంటి విన య్ గౌరిశెట్టి వెంకటేశ్ శర్మ యాంసాని చంద్ర శేఖర్ మంచాల లింగ మూర్తి ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

### మెట్ పల్లి కోర్టులో 1,645 కేసుల పరిష్కారం



**మెట్ పల్లి, జూన్ 20 (సింగిడి):** లోక్ అదాలత్ ల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మెట్ పల్లి కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. పరస్పర రాజీతో వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కారమైన కేసులపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. అనంతరం నిర్వహించిన రెండో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 1,645 కేసులను పరిష్కరించారు. వీటిలో పరస్పర రాజీ ద్వారా 97, మీడియేషన్ ద్వారా 16, అడ్మిషన్స్ ద్వారా 58, పీఎల్‌సీ ద్వారా 25, ఎస్టీసీ ద్వారా 1,449 కేసులు పరిష్కారమయ్యాయి. అడ్మిషన్స్ ద్వారా కక్షిదారులు రూ. 4,56,200, పీఎల్‌సీ ద్వారా రైతులు బ్యాంకులకు రూ. 6,78,629 చెల్లించినట్లు అధికారులు తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ఏపీపీ జి. ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వడ్డేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, మీడియేషన్ సభ్యులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్‌తో పాటు పలువురు న్యాయవాదులు, మెట్ పల్లి,మల్లాపూర్,ఇబ్రహీంపట్నం,పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనకు

## సమష్టి కృషి అవసరం

- డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యంగా అవగాహన, కట్టుదిట్టమైన చర్యలు
- కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, జూన్20(సింగిడి):** కరీంనగర్‌ను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు శాఖ, మహిళా–శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నార్కోటిక్ సమన్వయ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించ వచ్చని చెప్పారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, జూన్ 26న జరిగే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతి రేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లు, గ్రామ సభల ద్వారా ప్రజలకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దాడులు కొనసాగుతున్నాయని, కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జూన్ 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ చిత్రలేఖన పోటీలు, విద్యాసంస్థల సందర్శనలు, తల్లిదండ్రులు–ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. అలాగే జూన్ 26న ర్యాలీలు, గ్రామసభలు, మాదకద్ర వ్యాల నియంత్రణ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యాసంస్థల సమీపంలో పాన్ దుకాణాలు లేకుండా చర్యలు తీసుకుంటు న్నామని, అనుమానాస్పద సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రాప్ హాలిడే ప్రకటించి, ఎకరానికి రూ.20000 ఇవ్వాలి!

- రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదు.. బి ఆర్ ఎస్ నాయకులు,మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**జగిత్యాల, సింగిడి :** రాష్ట్రంలో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయని క్రాప్ హాలిడే ప్రకటించి ఎకరానికి 20వేల రూపాయల చొప్పున రైతులకు అందజేయాలని బిఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెరుగైన పాలనా అందిస్తామని అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి, హామీలు మరిచి అసలుకే ఎసరు పెట్టారని రేవంత్ రెడ్డి మాట్లాడుతూ లేదని మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శించారు. వరంగల్ లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ చేశారు 2 లక్షలు రుణ మాఫీ చేస్తామన్నారు. కొంతమందికి అసలే మాఫీ కాలేదన్నారు. వరిలో ఏ రకమైన ధాన్యానికి అయిన బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి సన్నలకు మాత్రమే బోనస్ అంటున్నారన్నారు. బోనస్ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్న ధాన్యం రకం ప్రభుత్వం ప్రకటించి సాగు చేయామనడం ఏంటి అని ప్రశ్నించారు. కేంద్రంఅనుమతించిన మేరకే పంటలు కొనుగోలు చేస్తామని అంటే.. మీరు ఎందుకు..అంటూ నిలదీశారు క్వింటాల్ కు మూడు నుండి ఐదు కిలోలు కోత కోశారన్నారు ధర్మ కాంట, ట్రక్ షీట్ వ్యత్యాసం రైతులకు చెల్లించాలన్నారు. దేశంలో ఎక్కడా కూడా యూరియా కొనుగోలుకు యాప్ లేదు. .కేవలం తెలంగాణలో మాత్రమే రైతుల ను గోస పోసుకునేందుకు తీసుకొచ్చారు. రైతులకు అవసరమైన యూరియా అందు బాటులో తీసుకువచ్చేందుకు దృష్టి సారిం చడం లేదన్నారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల ధాన్యం ఎకరానికి 20 క్వింటాల్ దిగుబడి వస్తె మిగిలిన రకాలు 30 ఎకరాలు దిగుబడి వస్తుందన్నారు. ఎకశీరానికి 24700 రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ధాన్యం సేకరణలో వైఫల్యం.. రుణ మాఫీ లో, రైతు భరోసా చెల్లింపులో, ధాన్యం సేకరణతో పాటు అన్నింట్లో విఫలం అయిందన్నారు. రేవంత్ రెడ్డి మాత్రం రైతు భరోసా.. ఎగ్గొడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి పాలన లో 7600 మంది రైతులు భీమా కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. బీమా ప్రీమియం చెల్లించలేక ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నదన్నారు. పంటల బీమా పథకం అమలు లేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు అతి లేదు.. గతి లేదన్నారు. రెండుళ్లు గడుస్తున్న కాళేశ్వరం పిల్లర్లు మరమతు కూడా చేపట్టలేక పో యారన్నారు. వరంగల్ డిక్లరేషన్ భగవద్గీత గా భావించి అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతఅన్నారు ఈ సమావేశం లో ఎమ్మెల్సీ ఎల్ రమణ మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావసంత సురేష్ గాజుల రాజేందర్ కల్లేపల్లి దుర్గయ్య, మాసర్తి రమేష్ , రాదకిషన్ , మహిపాల్, మల్లేష్ , శీలం సురేందర్, అబ్దుల్ భారీ, రియాజ్ ఖాన్, నేహాల్,రాకేష్ నాయక్, శ్రీధర్, రూప, అనురాధ, తిరుపతి, ఆనంద్ రావు, ప్రణయ్ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం పటిష్టంగా అమలు చేయాలి

**జగిత్యాల ప్రతినిధి (సింగిడి):** పోలీస్ శాఖలో సేవల నాణ్యతను, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేశారు ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పురోగతి, విచారణ విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీ లించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచాలని, ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల కేటా యింపు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, ట్రాఫిక్ చలానాలు, రోడ్డు భద్రతా కార్యక్రమాల అమలును పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్ విధానం, ట్రాఫిక్ నియంత్రణ కోసం వినియోగిస్తున్న పరికరాల



సామగ్రి పనితీరును తనిఖీ చేశారు. జిల్లాలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉం చుకొని ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యే క చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు ప్రమా దాల నివారణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచిం చారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

### శర్మనగర్‌లో భూగర్భ మురుగునీటి

## కాలువ పనులకు శంకుస్థాపన

- సుడా నిధులతో రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, జూన్ 20(సింగిడిడి):** నగరంలోని 53వ డివిజన్ శర్మనగర్‌లో సుడా నిధుల నుంచి రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు శనివారం రోజున సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేస్తూ, అంతర్గత రహదారులు మరియు మురుగునీటి వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటు న్నా మనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రాజేంద్ర ప్రసాద్, కార్పొరేటర్ కొంపెల్లి శ్వేతా రమణ్‌తో పాటు మహమ్మద్ మేరాజ్, సమియోద్దీన్, హరికృష్ణ, అబ్దుల్ వసీం, అనిల్, రాము, శ్రీనివాస్, కలీమ్, ముల్కల కవిత, అస్తాపురం తిరుమల, జ్యోతిరెడ్డి, కీర్తికుమార్, బషీర్, ఇమ్రాన్, పనుల పరిశీలకుడు అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో కరీంనగర్ రూపురేఖలు మారుస్తాం

- కేంద్ర నిధులతో రాష్ట్రంలోనే ఆదర్శ నగర పాలక సంస్థగా కరీంనగర్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**కరీంనగర్, జూన్ 20(సింగిడి):** కరీంనగర్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు వస్తున్నాయని, వాటితో నగర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే అగ్రగామి నగర పాలక సంస్థగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. శనివారం రోజున కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో నగర పాలక సంస్థ సాధారణ నిధులతో రూ. 67 లక్షల వ్యయంతో నిర్మించిన మురుగు నీటి పైప్‌లైన్, సిమెంట్ కాంక్రీట్ రహదారిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నా రు. అనంతరం విడుదల చేసిన ప్రకటనలో బండి సంజయ్ మాట్లాడుతూ, కేంద్ర పట్టణ సవాళ్ల నిధి (యూసీఎఫ్) జాబితాలో కరీంనగర్‌ను చేర్పించి రూ. 840 కోట్ల నిధులు సాధించామని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం కోసం మరో రూ. 80 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. గతంలో స్మార్ట్ సిటీ పథకం ద్వారా రూ. 900 కోట్లు, అమృత్–1, అమృత్–2 పథకాల ద్వారా రూ. 277 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. నగర పాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శ సంస్థగా నిలబెట్టడమే లక్ష్యమని తెలిపారు. శాత వాహన కళాశాలకు 12బీ హోదా, న్యాయ కళాశాల మంజూరు, ఎస్సాంఆర్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించడంతో పాటు అంబే ద్కర్ స్టేడియం, జమ్మికుంట స్టేడియం అభివృద్ధికి నిధులు సమకూర్చి నట్లు తెలిపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ప్రభుత్వ ఆసుప త్రులకు వైద్య పరికరాలు అందించామని, పదో తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో మళ్లీ చేపడతామన్నారు.

## జగ్గయ్య పల్లెలో ఘనంగా పోచమ్మ బోనాలు





- గ్రామ దేవతల ఆశీర్వాదం ప్రజలందరి పై ఉండాలి..
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్
- యువనేతకు ఘన స్వాగతం పలికిన గ్రామస్థులు
- సీసీ రోడ్ నిర్మాణానికి ప్రణవ్ బాబు కృషి

**జమ్మికుంట, జూన్ 20(సింగిడి):** గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఊర్లను కాపాడే అమ్మవార్లు ప్రజలకు ఇష్టమైన కోరికలు తీర్చాలని కోరుకుంటున్నట్లు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం రోజున జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి గ్రామంలో గ్రామ దేవతలైన శ్రీ మహాలక్ష్మి,భూ లక్ష్మీ,నాభి శిల (బొడ్రాయి),పోచమ్మ తల్లి బోనాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోచ మ్మ తల్లి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగ్గయ్యపల్లి గ్రామంలో ఇటీవల సీసీ రోడ్ నిర్మాణానికి కృషి చేసిన ప్రణవ్ బాబుకు జగ్గయ్యపల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గం, గ్రామ ప్రజలు శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని,ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, పొన్నగంటి మల్లయ్య దేశిని కోటి, నాయినేని రాజేశ్వరరావు ఉత్సవ కమిటీ,పాలకవర్గం, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం

- ప్రొఫెసర్ బి. రమేష్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు యోగ దినోత్సవం




**జమ్మికుంట, జూన్ 20 (సింగిడి):** యోగా తోనే ఆరోగ్యవంతమైన జీవితం ఉంటుందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బి. రమేష్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొపెసర్. బి. రమేష్ –అధ్యక్షతన ఎన్ఎస్ఎస్. (జాతీయ సేవా పథకం ) ఆధ్వర్యంలో శనివారం ముందస్తు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యత గూర్చి వివరించారు. నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని పొందుతారని అన్నారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో యోగా ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఓదేలు కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాను తమ దైనందిన జీవితం లో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే, రవిందర్, అధ్యాపకులు డాక్టర్ గణేష్, డాక్టర్ రాజేంద్రం,, డాక్టర శ్యామల, డాక్టర్ మాధవి,ఉమా కిరణ్, డాక్టర్ రాజకుమార్, కిరణ్ కుమార్, పి. శ్రీనివాస్ రెడ్డి, మమతా, డాక్టర్ సుష్మ, డాక్టర్, రవి ప్రకాశ్, డాక్టర్ శ్రీనివాస్, అరుణారాజ్ , సాయి కుమార్ శ్రీకాంత్, దీనా, డా. స్వప్న, సీనియర్ అసిస్టెంట్ డి. తిరుపతి , వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై అధికారులు చర్యలు తీసుకోవాలి

- పుస్తకాలు,యూనిఫారాల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లు -నిబంధనలు అతిక్రమిస్తే భౌతిక దాడులకు దిగుతాం
- బీసీ అజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్
- మండల విద్యాధికారికి వినతిపత్రం..



**జమ్మికుంట, జూన్ 20 (సింగిడి) :** హుజూరాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠ శాలలు విద్యా సంస్థలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా మారి తల్లిదండ్రు లపై అనవసర ఆర్థిక భారం మోపుతున్నా యని బీసీ ఆజాదీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్య క్షులు పంజాల రేవంత్ అన్నారు . విద్యను హక్కుగా అందించాల్సిన పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని అధిక లాభాల కోసం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా యని ఆరోపించారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో పాఠశాల యాజమా న్యాలు విద్యార్థులకు అవసరమైన పుస్తకా లు, నోట్‌బుక్స్, యూనిఫారాలు, షూస్, బెల్టులు, టైలు ఇతర విద్యా సామగ్రిని పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాల ని ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. కొన్ని పాఠశాలలు మార్కెట్‌లో రూ. 2,000 నుండి రూ. 3,000 వరకు లభించే వస్తువులను రూ. 5,000 నుండి రూ. 10,000 వరకు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే పెరిగిన విద్యా ఫీజులు, రవాణా ఛార్జీలు, హాస్టల్ ఖర్చులు, ఇతర జీవన వ్యయాల తో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రైవేట్ పాఠశా లల ఈ విధానాలు వారిని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తు న్నాయని అన్నారు. పిల్లల భవిష్యత్తు కో సం తల్లిదండ్రులు మౌనంగా భరిస్తున్న పరిస్థితిని కొందరు యాజమాన్యాలు దు ర్వినియోగం చేస్తున్నాయని విమర్శిం చారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలు పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం లేదా నిర్దిష్ట దుకాణాల నుండి కొనుగోలు చేయాలని బలవంతం చేయడం సరికాదని గుర్తు చేశారు. అయినప్పటికీ అనేక పాఠశాలలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ తమకు అను కూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిం చారు.
కొంతమంది తల్లిదండ్రులు బయ ట కొనుగోలు చేసిన యూనిఫారాలు లే దా పుస్తకాలను అంగీకరించకపోవడం కూడా జరుగుతోందని తెలి పారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఈ వ్యవహారా లపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించా లని, మండలస్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిబం ధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకా లు, యూనిఫారాలు విక్రయిస్తున్న యాజ మాన్యాలపై జరి మానాలు విధించడంతో పాటు అవసరమైతే గుర్తింపు రద్దు చేసే వరకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై హుజూరాబాద్ మండల విద్యాధికారి విడుపు శ్రీనివాస్ కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, రఘువర్ధన్, శ్రీ కృష్ణ, రమేష్,అక్షయ్,భరత్ తదితరులు పాల్గొన్నారు

# జిమ్.. డైటింగ్ అవసరం లేదు..!

## ఈ చిన్న మార్పులతో బరువు తగ్గడం చాలా ఈజీ..



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య అధిక బరువు. బరువు తగ్గడం కోసం రాత్రి రాత్రికే కఠినమైన డైటింగ్స్ చేయడం, జిమ్‌లలో గంటల తరబడి చెమటలు చిందించడం చేస్తుంటారు.అయితే బరువు తగ్గడానికి కఠినమైన నియమాలు అవసరం లేదని.. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే ఇందుకు ఉత్తమ మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఒకే రోజులో మ్యాజిక్ జరగదు కాబట్టి లాంగ్ టర్మ్‌లో ఫిట్‌గా ఉండటానికి వైద్య నిపుణులు సూచిస్తున్న ఆ 3 సింపుల్ అండ్ పవర్‌ఫుల్ లైఫ్‌స్టైల్ మార్పులు ఏంటో తెలుసుకుందాం..



**రాత్రి పూట స్వీట్ క్రేవింగ్స్‌కు ఇలా చెక్ పెట్టండి**

చాలా మందికి రాత్రి భోజనం చేసిన తర్వాత లేదా అర్ధరాత్రి పూట సడన్‌గా స్వీట్లు, చాక్లెట్లు లేదా కేకులు తినాలనే కోరిక కలుగుతుంది. బరువు పెరగడానికి ఇది ఒక ముఖ్య కారణం. ఈ అలవాటును అదుపు చేయడం చాలా మందికి ఒక పెద్ద సవాలు. అయితే ఇలాంటి సమయాల్లో అధిక క్యాలరీలు ఉండే చాక్లెట్లకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి సిద్ధమైన పండ్లను ఎంచుకోవాలని న్యూట్రిషనిస్టులు సలహా ఇస్తున్నారు. ఉదాహరణకు.. ఒక ఆపిల్ ముక్కపై కొద్దిగా నట్స్ బటర్ రాసుకుని తినడం వల్ల శరీరానికి ఎలాంటి హాని జరగదు. పైగా తక్కువ క్యాలరీలతోనే స్వీట్ తినాలనే కోరిక తీరుతుంది.

**డైట్ ప్లాన్ -- క్యాలరీల లెక్క**

ఆరోగ్యకరమైన వెయిట్ లాస్ కోసం సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ వ్యాయామం సమపాళ్లలో ఉండాలి. ఇందుకోసం మీ రోజువారీ భోజనాన్ని ఇలా ప్లాన్ చేసుకోండి..

**ఉదయపు అల్పాహారం :** బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ స్కిప్ చేయకూడదు. ఇది పూర్తిగా, పోషకాలతో నిండి ఉండాలి.

**మధ్యాహ్న భోజనం :** లంచ్ ఎప్పుడూ మితంగా ఉండాలి.

**రాత్రి భోజనం:** డిన్నర్ చాలా తేలికగా, తక్కువ క్వాంటిటీలో ఉండాలి.

ముఖ్యంగా నూనెలో వేయించిన ఫ్రైలు, కొవ్వు పదార్థాలను పక్కన పెట్టి.. ఆకుకూరలు, కూరగాయలు, గుడ్డు తెల్లసొన వంటి ప్రోటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.



**ఒకే రోజులో మార్పు రాదు.. కన్సిస్టెన్సీ ముఖ్యం**

శరీరంలో మార్పులు అనేవి ఒకే రోజులో లేదా ఒకే రాత్రిలో జరిగిపోవు. అందుకే నెలకు 10 కిలోలు తగ్గాలి లాంటి భారీ లక్ష్యాలు పెట్టుకోకుండా.. వారంతపు ప్రాతిపదికన చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలి. ఎప్పుడో ఒకసారి వ్యాయామం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. నిరంతరాయంగా, ప్రతిరోజూ చేసే చిన్నపాటి వ్యాయామం మాత్రమే శరీరంలో మెటబాలిజం రేటును పెంచి, కొవ్వును వేగంగా కరిగిస్తుంది. అలసట పడకుండా ఈ సింపుల్ అలవాట్లను లైఫ్‌స్టైల్‌గా మార్చుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్యం మీ సొంతం అవుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారికి

# మసాలాలు లేని హెల్తీ కొత్తిమీర కోడికూర

కొత్తిమీర చికెన్ కూర ఒంటికి చలువు చేయడమే కాకుండా, కడుపుకు ఎంతో హాయిని ఇస్తుంది. ఈ రుచికరమైన కూరను తయారు చేయడానికి ముందుగా అడుగు మందంగా ఉండే కడాయిలో ఐదారు స్పూన్ల నూనె వేడి చేయాలి. అందులో మూడు మీడియం సైజు ఉల్లిపాయల సన్నని ముక్కలు, కరివేపాకు, ఉప్పు వేసి ఉల్లిపాయలు మంచి గోల్డెన్ కలర్ వచ్చే వరకు వేయించుకోవాలి.





తర్వాత కొద్దిగా పసుపు, ఒక కేజీ శుభ్రం చేసిన చికెన్ వేసి హై ఫ్లేమ్ మీద ఐదారు నిమిషాలు వేయించి, ఆపై మూత పెట్టిలో ఫ్లేమ్‌లో మగ్గనివ్వాలి. చికెన్ మగ్గేలోపు ఒక కప్పు నిండా తాజా కొత్తిమీర, కొద్దిగా అల్లం, 10-15 వెల్లుల్లి రెబ్బలు, 5-6 పచ్చిమిర్చి వేసి నీళ్లు పోయకుండా మిక్సీలో మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి.



ఇప్పుడు మగ్గుతున్న చికెన్ లో తగినంత కారం వేసి, చికెన్ లోని నీరంతా పూర్తిగా ఇగిరిపోయి నూనె పైకి తేలే వరకు వేయించాలి. ఆతర్వాత మనం గ్రైండ్ చేసి పెట్టుకున్న పచ్చటి కొత్తిమీర-అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను కూరలో వేసి రెండు మూడు నిమిషాలపాటు బాగా కలుపుతూ వేయించాలి.

ఈ మసాలా ముక్కలకు బాగా పట్టిన తర్వాత, గ్రేవీ కోసం కొన్ని వేడి నీళ్లను పోసి, ఉప్పు అడ్జస్ట్ చేసుకుని మూత పెట్టి లో ఫ్లేమ్ లో మరికొంత సేపు ఉడికించుకోవాలి. కూర చక్కగా ఉడికిన తర్వాత నూనె పైకి తేలుతుంది. చికెన్ ముక్క సాఫ్ట్‌గా ఉడికి, గ్రేవీ చిక్కబడగానే స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. కొంచెం పులుపు ఇష్టపడేవారు చివర్లో కొద్దిగా నిమ్మరసం పిండుకోవచ్చు.

అంతే, ఎలాంటి గరం మసాలా పొడులు వాడకపోయినా అస్సలు నీచు వాసన రాకుండా, కొత్తిమీర ఫ్లేవర్‌తో గుమగుమలాడే చికెన్ కర్రీ రెడీ. దీనిని వేడి వేడి అన్నం, బగారా రైస్, చపాతీ లేదా జొన్న రొట్టెల్లోకి తింటే రుచి అద్భుతంగా ఉంటుంది. ఆరోగ్యానికి ఆరోగ్యం, రుచికి రుచి ఇచ్చే ఈ సింపుల్ చికెన్ కర్రీని మీరు తప్పకుండా ట్రై చేయండి!



### ఏఐ యుగంలో బహుళ


# విషయ విద్యే భవిష్యత్

## ప్రొఫెసర్ వాల్టర్ లీల్, డాక్టర్ ఆశిష్ భరద్వాజ్



**హైదరాబాద్ బ్యూరో జూన్ 20 నినాదం :** కృత్రిమ మేధస్సు (ఏఐ), వేగవంతమైన సాంకేతిక మార్పుల నేపథ్యంలో విద్యార్థులను కేవలం మొదటి ఉద్యోగానికే కాకుండా జీవితకాలంలో ఎదురయ్యే పలు వృత్తి మార్పులకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని వరల్డ్ పీస్ యూనివర్సిటీ (డబ్ల్యూపీయూ), గోవా ప్రతినిధులు పేర్కొన్నారు.జూన్ 20న నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో మాట్లాడిన డబ్ల్యూపీయూ గోవా వైస్ ఛాన్సలర్ లిప్రొఫెసర్ వాల్టర్ లీల్‌లి, బహుళ విషయ (ట్రాన్స్‌డిసిప్లినరీ) విద్యా విధానం ద్వారా విద్యార్థుల్లో అనుకూలత, జీవితకాల అభ్యాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే విశ్వవిద్యాలయ లక్ష్యమని తెలిపారు.డబ్ల్యూపీయూ గోవా ప్రో వైస్ ఛాన్సలర్ లిడాక్టర్ ఆశిష్ భరద్వాజ్‌లి మాట్లాడుతూ, భవిష్యత్తు ఉద్యోగాలకు కేవలం ప్రత్యేక నైపుణ్యాలు సరిపోవని, నిరంతరం నేర్చుకునే సామర్థ్యం, వివిధ రంగాల ఆలోచనలను అనుసంధానించే నైపుణ్యం అత్యంత కీలకమని అన్నారు.ప్రస్తుతం డబ్ల్యూపీయూ గోవాలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), బీఎంఎస్ (ఆనర్స్), బీడిజైన్, బీఎస్సీ సైకాలజీ (ఆనర్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో వచ్చే కొత్త అవకాశాలు, వృత్తి మార్పులను ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఉన్నత విద్య ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు.

## 16 రకాల ఔషధాలను నిషేధించిన కేంద్రం



ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాంటి బయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు సంబంధించిన 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను నిషేధించింది. వీటి తయారీ, విక్రయం, సరఫరా నిలిపివేయాలని ఆదేశించింది. ఈ ఔషధాల కలయిక వల్ల చికిత్స నయం కావడానికి ఎలాంటి శాస్త్రీయపరమైన ఆధారాల్లేవని నిరూపితమైనట్టు పేర్కొంది. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుకు చెందిన నిపుణుల కమిటీ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

రెండు, మూడు రకాల ఔషధాలను ఒకే మోతాదులో కలిపి ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలను తయారుచేస్తారు. వీటి పనితీరుపై డీటీఏబీ కొన్నేళ్లుగా సమీక్షిస్తోంది. ఈ క్రమంలోనే చికిత్స మెరుగుదలకు ఎలాంటి ప్రయోజనం లేని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు యాంటిబయాటిక్స్, టాపికల్, కాస్మటిక్స్‌కు చెందిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను కేంద్రం బ్యాన్ చేసింది.

## పీఎం కిసాన్ నిధులు విడుదల

రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు ..



**మీ పేరుందా..?**


పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

## మాసీఐకాన్ 2026లో కోక్లియర్ ఇంప్లాంట్‌పై నిపుణుల చర్చలు



**హైదరాబాద్, బ్యూరో జూన్ 20 నినాదం :** మా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఎం ఐ ఎస్ హెచ్ ), మా ఈఎన్‌టీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసీఐకాన్ 2026 సదస్సులో కోక్లియర్ ఇంప్లాంట్ రంగంలోని తాజా సాంకేతికతలు, క్లినికల్ సవాళ్లు, పునరావాస విధానాలపై నిపుణులు చర్చించారు. వినికిడి లోపమున్న చిన్నారుల్లో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించి వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడే మార్గాలపై మేధోమథనం జరిగినట్లు సంస్థ వ్యవస్థాపకులు, చైర్‌పర్సన్ సునీత కుమార్ తెలిపారు.జూన్ 20, 21 తేదీల్లో జరుగుతున్న ఈ సదస్సులో డా. సుమన్ కుమార్, ప్రొఫెసర్ రాజశేఖర్, రవి వడ్లమాని, రమేష్ వంగల, శివాని త్రివేవాలా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 150 మంది ఈఎన్‌టీ వైద్యులు, ఆడియాలజిస్టులు, పరిశోధకులు హాజరయ్యారు. కోక్లియర్ ఇంప్లాంట్ అర్హతలు, శస్త్రచికిత్సలు, మ్యాపింగ్, తాజా సాంకేతిక పురోగతులపై రెండు రోజుల పాటు నిపుణుల ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు జరగనున్నాయి.

**నినాదం మార్కెట్**



### సూచీల లాభాలకు

# 'ఐటీ' బ్రేక్

## ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.4859.07 కోట్లు

## డీఐఐ విక్రయాలు.. రూ.1159.64 కోట్లు

ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో దేశీయ సూచీలు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. బహుళజాతి ఐటీ సంస్థ యాక్సెంచర్, భవిష్యత్తు ఆదాయ అంచనాల్లో కోత విధించడం ఇందుకు కారణమైంది. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారుకు సంబంధించిన చర్చలు వాయిదా పడటం వల్లా మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఫలితంగా అయిదు రోజుల వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పెరిగి 94.33 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.66% పెరిగి 80.38 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ఆరంభమయ్యాయి.

బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.7000 కోట్లు తగ్గి రూ.477.53 లక్షల కోట్ల (5.05 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఆద్యంతం నష్టాల్లోనే: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 76,852.86 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 77,409.98) ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ ఒక దశలో 76,469.72 పాయింట్లకు దిగివచ్చింది. చివరకు 607.08 పాయింట్ల నష్టంతో 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 154.90 పాయింట్లు కోల్పోయి 24,013.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,047.20 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని; 23,901.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

12 మినహా మిగతావి నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ ఎక్కువగా నష్టపోగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.32%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.11%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.39%, హిందుస్థాన్ యునిలీవర్ 1.02%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.01% తగ్గాయి. ఎటర్నల్ 2.21%, భారతీ ఎయిర్‌టెల్ 1.8%, పవర్‌గ్రిడ్ 1.32%, ఎన్‌టీపీసీ 1.04%, టైటన్ 0.84%, ఐటీసీ 0.79%, ట్రెంట్ 0.77% పెరిగాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో ఐటీ, చమురు- గ్యాస్, ఇంధనం, స్థిరాస్తి, పీఎస్‌యూ బ్యాంక్ డీలాపడగా.. టెలికాం, విద్యుత్, ఇండస్ట్రియల్స్, ఆరోగ్యో సంరక్షణ, యుటిలిటీస్ రాణించాయి.

ఐటీ షేర్లు దిగాలు..: పూర్తి సంవత్సరానికి ఆదాయ అంచనాలను యాక్సెంచర్ తగ్గించడంతో, దేశీయంగా ఐటీ కంపెనీల షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ 6.69%, ఎల్‌టీఐఎం 4.12%, టీసీఎస్ 3.53%, హెచ్‌సీఎల్ 2.74%, టెక్ మహీంద్రా 2.47%, విప్రో 1.2% నష్టపోయాయి. ఈ సంస్థలన్నీ కలిసి రూ.77,597.46 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయాయి.

రిలయన్స్ షేరుకు 1.39% నష్టం: ఏజీఎం నేపథ్యంలో, ఈ వారంలో 6% పెరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు శుక్రవారం లాభాల స్వీకరణ ఎదురైంది. బీఎస్ఈలో ఈనెల 11న షేరు ధర రూ.1253. ఇది 52 వారాల కనిష్ఠస్థాయి కాగా, గురువారం రూ.1328 వద్ద ముగిసింది. శుక్రవారం ఈ షేరు 1.39% తగ్గి రూ.1,309.35 వద్ద ముగిసింది.

5 కంపెనీల ఐపీఓలకు సెబీ ఆమోదం

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్, శ్రేణి షేర్స్, ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ దరఖాస్తులకు సెబీ ఆమోదం లభించింది. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపేణా జరగనుంది. 20.37 కోట్ల వరకు షేర్లను ప్రస్తుత ప్రమోటర్లయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆముంది హోల్డింగ్ విక్రయించనున్నాయి. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్ ఐపీఓ ముసాయిదా పత్రాలను సెబీకి రహస్య పద్ధతిలో సమర్పించాయి. శ్రేణి షేర్స్ ఇష్యూలో 60 లక్షల వరకు తాజా షేర్లను, ఓఎఫ్ఎస్ ద్వారా 82 లక్షల షేర్లను విక్రయిస్తారు. ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓ పూర్తిగా తాజా షేర్ల రూపేణా ఉండనుంది. 1.68 కోట్ల తాజా షేర్లను జారీ చేయనున్నారు.

# సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యం

## - తపస్ సభ్యత్వ అభియాన్ ప్రారంభంలో జిల్లా అధ్యక్షులు నరసింహ



**నారాయణపేట ప్రతినిధి, జూన్ 20, (సింగిడి):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ అభియాన్ కార్యక్రమాన్ని జాజాపూర్, అప్పంపల్లి పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తపస్ ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసిందని తెలిపారు. అందుకు ఉపాధ్యాయులందరూ ఉద్యమానికి తోడుగా నిలవాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ బడుల పటిష్టత కోసం కృషి చేస్తూ బాధ్యతగల జాతీయ భావాలు గల యువతను సిద్ధం చేయడమే తపస్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, పి డి ఎస్ భానుప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహ నాయకులు లక్ష్మణ్, మధుసూదన్ రావ్, మంగళ,శ్రీదేవి రఘురా మేశ్వర్, ప్రతాప్, నిర్మల స్వాతి,శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ప్రోత్సాహమే క్రీడాకారుడి అసలైన బలం..

## -అథ్లెట్కు అండగా పీడీ శ్రీధర్



**బిక్నూర్, జూన్ 20 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించి ప్రతిభ చాటుకున్న భిక్నూర్ అథ్లెట్ దేవుని భరత్ రాజ్ కు భిక్నూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పీడీ శ్రీధర్ క్రీడా సామగ్రిని అందించి తన ప్రోత్సాహాన్ని చాటుకున్నారు. భరత్ రాజ్ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలనే ఆకాంక్షతో స్పోర్ట్స్ (ట్రాక్ సూట్, ట్రాక్ ప్యాంట్, ట్రాక్ టీ-షర్ట్ను) స్వయంగా స్పాన్సర్ చేశారు. ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అనే సందేశాన్ని శ్రీధర్ అందించారని పలువురు అభినందించారు.తనపై నమ్మకం ఉంచి అవసరమైన క్రీడా సామాగ్రిని అందించిన పీడీ శ్రీధర్ సారుకు క్రీడాకారుడు దేవుని భరత్ రాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## అయిజలో కనకదుర్గమ్మ

# ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**గద్వాల ప్రతి జూన్ 20 (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని దుర్గాన్ నగర్లో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం ఎంతో గొప్పదని, కోట్ల సంవత్సరాలుగా ఈ ధర్మం కొనసాగుతూ వస్తోందన్నారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దుర్గా నగర్లో హిందూ బంధువులు కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణం కోసం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేఆర్ అశోక్, రంగు కృష్ణ, లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్, భీమన్న, రఘు తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పీఎం మోదీ రైతు బాంధవుడు

## రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి



**గద్వాల ప్రతినిధి జూన్ 20 (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో ఎఫికో, కోరమండల్, ఫ్యాక్ట్, ఐపిఎల్, కంపెనీల ప్రతినిధులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతి థిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 23వ విడత నిధుల విడుదల సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు.పశ్చిమ బెంగాల్లోని తారకేశ్వర్లో ప్రధాని మోదీ 9.44 లక్షల మంది రైతులకు రూ.18,880 కోట్ల నిధులను విడుదల చేశారని తెలిపారు. ఇప్పటివరకు పీఎం కిసాన్ ద్వారా రూ.4.64 లక్షల కోట్లకు పైగా నిధులు అందించారని పేర్కొన్నారు. ఎరువులపై కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.3 లక్షల కోట్ల వరకు సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు, నానో యూరి యా, డీఏపీ వినియోగించి భూమాతను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎఫ్సీఓ, ఎఫ్ఏసీటీ, ఐపీఎల్, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు, రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్లో 77 మందికి జైలు శిక్షలు



**కామారెడ్డి బ్యూరో, జూన్ 20(సింగిడి):** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 408 మందికి కోర్టు శిక్షలు విధించినట్లు జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులకు కోర్టు రూ.4,78,900 జరిమానా విధించగా, అందులో 77 మందికి కోర్టు జైలు శిక్షలు ఖరారు చేసిందని పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని, మద్యం సేవించి వాహనం నడిపే వారితో పాటు రోడ్డుపై వెళ్లే వారికీ పెద్ద ప్రమాదమే అని పేర్కొన్నారు.

# నేడే 'ఫాదర్స్ డే' బాధ్యతల 'నాన్న'కు వందనం!

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 20, (సింగిడి):** అమ్మ లాలిపాటలైతే... నాన్న బతుకుపాట. అమ్మ జన్మనిస్తే... ఆ జన్మకు సార్థకతను, ధైర్యాన్ని ఇచ్చేది నాన్న. కుటుంబం కోసం అహర్నిశలూ శ్రమించే పితృదేవుళ్లను స్మరించుకుంటూ, వారికి కృతజ్ఞతలు తెలిపే అంతర్జాతీయ పితృ దినోత్సవం' (ఫాదర్స్ డే) ను నేడు (ఆదివారం) ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా జూన్ మూడో ఆదివారాన్ని ఫాదర్స్ డేగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా నగరంలో పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి. కుటుంబభారాన్ని భుజాలపై మోస్తూ, తన కష్టాన్ని పైకి నవ్వుతూ దాచేసే నిశ్శబ్ద త్యాగమూర్తి తండ్రి.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- నాగర్కర్నూల్ కలెక్టరేట్లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష




**గద్వాల బ్యూరో జూన్ 20 (సింగిడి):** రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేట్లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్తో పాటు నాగర్కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉంది, ఎంత భూమి పీఎం స్థాయి లో ఉంది, ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్లో ఉన్నాయనే అంశాల పై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగు నీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు.ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెట్టెం పాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులతో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం భూసేకరణ విషయంపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఆ యా ప్రాజెక్టుల పనులు పూర్తయితే సాగునీటి తోపాటు వ్యవసాయాధారిత పరిశ్రమలకు కూడా ప్రోత్సాహం లభించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా వివరించారు.

# నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

## టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**కల్వకుర్తి జూన్ 20 (సింగిడి):** తుక్కుగూడ లోని ప్రముఖ అంతర్జాతీయ ఎలక్ట్రానిక్ కంపెనీలో గత రెండు వారాల క్రితం ఇంటర్వ్యూ కు హాజరైన వారిలో ఉద్యోగాలు సాధించిన కల్వకుర్తి నియోజక వర్గంలోని వివిధ మండలాల 9 మంది నిరుద్యోగయువత జాయినింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వారిని అభినందించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత కష్టపడి చదివి, నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రతిష్టాత్మక సంస్థల్లో, కంపెనీలల్లో ఉద్యోగాలు పొందడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఉద్యోగం సాధించిన యువత ఇతర నిరుద్యోగులకు ఆదర్శంగా నిలవాలని, తమ వృత్తిలో రాణిస్తూ , ఆర్థికంగా బలోపేతం అవుతూ, ఉజ్వలమైన భవిష్యత్ నిర్మాణం కోసం అడుగులువేయాలని ఆకాంక్షించారు. అలాగే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్లు, ఉచిత శిక్షణా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు , అవగాహన కార్యక్రమాలు మరింత మందియువతకు ఉపయోగ పడాలని పేర్కొన్నా రు. భవిష్యత్తులో కూడా నిరుద్యోగ యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ , సహకారాల కోసం కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని అర్హత ఉన్న నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భం గా నిరుద్యోగ యువత మాట్లాడుతూ మా భవిష్యత్ గురించి ఆలోచిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ మాకు తోడ్పాటునందిస్తున్నందుకు ,ఇంత మంచి అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి రుణపడి ఉంటామని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు , ఐక్యత పౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు

# కల్వకుర్తి సీఐగా భీమ్కుమార్




**కల్వకుర్తి జూన్ 20 (సింగిడి):** కల్వకుర్తి మండల సీఐ గా భీమ్ కుమార్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ నాగార్జున బదిలీ కావడంతో ఆ స్థానంలో వికారాబాద్ నుంచి బదిలీగా విచ్చేసిన భీమ్ కుమార్ను నియమించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ భీమ్ కుమార్ మాట్లాడుతూ.శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు.అక్రమ ఇసుక రవణా పై,అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. గుట్కా, పేకాట, గంజాయి పై, ఉక్కు పాదం మోపనున్నట్లు తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి

## -ఎంఈఓ డి రాములుకు బీఆర్ఎస్వీ నాయకుల వినతి




**గద్వాల ప్రతినిధి జూన్ 20 (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు ఐజ మండల ఎంఈఓ రాములుకు వినతిపత్రం సమర్పించారు.బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పల్లయ్య మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేద విద్యార్థులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోతే విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నరేష్ రంగస్వామి, తులసి గౌడ్, రాజు, రమేష్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి జూన్ 20 (సింగిడి):** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరుతూ లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతంకై ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం వహించాలని వారు కొనియాడారు. అనంతరం వేసవికాల సెలవులు ముగించుకొని 1వ తరగతి లో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు అక్షర బ్యాసాన్ని నిర్వహించారు. అలాగే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి డూప్యూటీ సర్పంచ్ బూత్కూరి వెంకట్ రెడ్డి ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి ప్రసన్న మేడం ఆనంద్ రావు సార్ వార్డ్ సభ్యులు రాజమౌని భాగ్య మల్లేమోగ్గాలా శ్రీజ చింతలపల్లి సురేందర్ రెడ్డి బొచ్చుపల్లి శేఖర్ అంగన్వాడీ టీచర్స్ భారతి రత్నమ్మ సాత్విక మరియు మహిళ సంఘం అధ్యక్షురాలు వసంత మరియు గ్రామ పెద్దలు గ్రామస్తులు మహిళాలు బాల బాలికలు పాల్గొనడం జరిగింది.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా ఆసనాలు వేయండి

## సింగరేణి జిఎం



**మణుగూరు, జూన్ 20(సింగిడి):** నేటి యుగంలో కాలమాన పరిస్థితులను అనుసరిస్తూ, ఆరోగ్యకరమైన వృద్ధాప్యాన్ని పొందేందుకు ప్రతి ఒక్కరూ యోగ ఆసనాలను అనుసరించి తీరాలని మణుగూరుసింగరేణి కాలరీస్ జిఎం దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ యోగ దినోత్సవం పురస్కరించుకొని సింగరేణి కాలరీస్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన యోగా ఆసనం కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి ఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆదేశాల మేరకు సింగరేణి కాలరీస్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. యోగ శారీరిక వ్యాయాయము కాదని, ఇది కేవలం మానసికఒత్తిడి , శారీరక దృఢత్వము,ప్రశాంతత కోసంఆరోగ్యకరమైన జీవన స్థితిని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. ఈ రోజుల్లో ప్రతి మానవుడు ఎదుర్కొంటున్న ఒత్తిడితో కూడిన జీవనము యోగ ఆసనం ద్వారా శరీరము మనసు ప్రశాంతత నీ యోగ ఆసనాల ద్వారా పొందే అవకాశం ఉందని ఆయన అన్నారు.

మన సింగరేణి కార్మికులు ప్రతిరోజు యోగా ఆసనము నిర్వహిస్తే ఆరోగ్యము ప్రశాంతత ఏర్పడటమే కాకుండా కంపెనీ యొక్క ఉత్పాదక శక్తిని గణనీయంగా మెరుగుపరుచుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు. యోగా ఆసనా నిపుణులు సాంబశివరావు యోగ ఆసనం నిర్వహించి ప్రతిఆసనం ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా సాంబశివరావుకు సింగరేణి యాజమాన్యం తరుపున మెమొంటో జ్ఞాపకను అందజేశారు.

కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం రామారావు, ఏజీఎం పర్సనల్ రమేష్, సీతా రాంబాబు గుర్తింపు సంఘం నాయకులు రాంగోపాల్ మరియు ప్రాతినిధ్య సంఘం నాయకులు ఎస్.కె అబ్దుల్ రహూఫ్ సీజీఎం జనరల్ సెక్రెటరీ మదన్ నాయక్ శివప్రసాద్, దయాకర్, సుదర్శన్ రెడ్డి సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# వేణిసోంపురంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**గద్వాల ప్రతినిధి జూన్ 20 (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వేణిసోంపురం గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) నర్సింగ రావు శనివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతి, కూలీల హాజరు, మస్టర్ రోల్స్, పనుల నాణ్యతను ఆయన స్వయంగా తనిఖీ చేశారు.పని ప్రదేశానికి చేరుకున్న అడిషనల్ కలెక్టర్ ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు అందుతున్న పనిదినాలు, కూలీ డబ్బుల చెల్లింపుల వివరాలు, పని ప్రదేశంలో కల్పిస్తున్న తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. కూలీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బి. శంకరమ్మ కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఉపాధి పనులను మరింత వేగవంతం చేసి ఎక్కువ మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అధికారులు పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. భాస్కర్ యాదవ్, ఏపీఓ రాజేష్ లాలు నాయక్, ఎంపీఓ కె. నాగరాజు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ఫేక్ ప్రభుత్వం



**కామారెడ్డి బ్యూరో, జూన్ 20(సింగిడి):** "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ఫేక్ ప్రభుత్వమని, రైతులకు ఇచ్చిన హామీలన్నీ విస్మరించి, పరిపాలన చేతకాక దద్దమ్మలా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపిస్తూ...ధ్వజమెత్తారు. శనివారం బాన్సువాడలో రైతులు పడుతున్న ఇబ్బందులపై నియోజకవర్గ ఇంచార్జ్ తోట ఆగమయ్య, రైతు బంధు మాజీ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, కిషన్, ఫెరోజ్, అక్బర్, ఖలీల్, బాడీ శ్రీను తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారూ. గత బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రైతులకు సాగునీరు, ధాన్యం కొనుగోళ్లు, రైతుబంధు ఇలా అన్ని సమస్యలూ పరిష్కరించారు. వ్యవసాయం, టెక్నాలజీ, విద్య అన్ని రంగాల్లో తెలంగాణను ముందుకు తీసుకెళ్లాం. కాళేశ్వరం ద్వారా నిజాంసాగర్కు నీళ్లు ఇచ్చి బాన్సువాడ రైతాంగాన్ని ఆదుకున్నాం" అని గుర్తు చేశారు. "రైతు భరోసా, బోనస్, ధాన్యం కొనుగోలుపై సీఎం రేవంత్ ఇష్టానుసారం మాట్లాడారు, కానీ ఇప్పుడు అన్నీ విస్మరించారన్నారు. రైతుబంధు సరిగా ఇవ్వడం లేదని, 24 గంటల కరెంట్ ఇవ్వలేకపోతున్నారని, పరిపాలన చేతకాని దద్దమ్మ పాలన వుందన్నారు.

# 40వ ఒలింపిక్ డే రన్ను ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 20 (సింగిడి) :** అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40వ ఒలింపిక్ డే రన్ను ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఒలింపిక్ డే రన్ను ప్రారంభించారు.జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, కామారెడ్డి వద్ద ప్రారంభమైన రన్ కాకతీయ నగర్లోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది.ఈ రన్లో విద్యార్థులు, క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఒలింపిక్ స్ఫూర్తి,క్రీడా స్ఫూర్తి,క్రమశిక్షణ,ఐక్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్ ఎన్.వి గిరి,సంబంధిత జిల్లా అధికారులు,జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ డా.కె. పి.అనిల్ కుమార్, చైర్మన్ డా.ఎం.జైపాల్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 21-6-2026

# నెహ్రూ ఆశయాల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

**దేశ అభివృద్ధికి నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయం: డా. మేడిపల్లి సత్యం, వైద్యుల అంజన్‌కుమార్**



**కరీంనగర్, (సింగిడి):** భారత తొలిప్రధానమంత్రి, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో స్మారక కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డా. మేడి పల్లి సత్యం ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పిం చారు. కార్యక్రమంలో సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. అలాగే నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సవరన్ స్ట్రీట్‌లోని పాత నెహ్రూ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు. డా. మేడిపల్లి సత్యం, వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషిం చిన నెహ్రూ దేశనిర్మాణానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పంచవర్ష ప్రణాళికలు, సాగు-తాగునీటి ప్రాజెక్టులు, ఐఐటీలు, ఎయిమ్స్‌వంటి సంస్థల స్థాపన ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేతగా నెహ్రూను కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమాలలో నాయకులు ఎండి తాజ్, మడుపు మోహన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముత్యం శంకర్‌గౌడ్, ఉప్పుల అంజనీప్రసాద్, సరిల్లప్రసాద్, వరాల నర్సింగం, గుం డాటి శ్రీనివాస్ రెడ్డి, అహ మ్మద్‌అలీ, అబ్దుల్ రహమాన్, వంగల విద్యా సాగర్, సువీన్‌యాదవ్, మూల రవీందర్‌రెడ్డి, రూపురెడ్డి శ్రీనివాసరెడ్డి, గడప శ్రీనివాస్, సరిల్ల రతన్ రాజు, నిహాల్, కంకణాల అనిల్, విక్టర్, అమీర్, ఇమ్రాన్, కుంభాల రాజు కుమార్, శిల్ప, లాయికు, సత్తినేని శ్రీకాంత్, మేకల నరసయ్య, గడ్డం శ్రీరామ్, మంద మహేష్, మాజీద్ అలీ ఖాన్, వీరదేవేందర్, ఇమ్రాన్ గని, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**అన్నిశాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, (సింగిడి):** జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్స వాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశిం చారు. కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిం చారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే ప్రధాన వేడుకలకు ప్రోటోకాల్‌కు అనుగు ణంగా కూర్చోవడానికి సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాపా లన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతి బింబించేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యుత్ శాఖ తదితర విభాగాల ఆధ్వర్యంలో అంశాల వారీగా ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, మండలాలు, గ్రామ స్థాయిల్లో కూడా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేం దుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలతో పాటు ఆస్తులు, రుణాల పంపిణీ పత్రాలు, మహిళా సంఘాలకు బ్యాంకు అనుసంధాన పత్రాల పంపిణీ కార్యక్రమా లను కూడా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, డీసీపీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం బాలామృతం

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**




**జమ్మికుంట,(సింగిడి):** పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా జమ్మి కుంట ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణంలో ఉన్న అంగన్వాడి సెంటర్ నం మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమిషనర్ గట్టు మల్లికార్జున స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి పౌష్టిక ఆహారాన్ని పిల్లలకు అందించాలని వారు సూచిం చారు. బాలామృతం ద్వారా పిల్లల ఎదుగుదల బాగుంటుందని వారు ఇష్టపడేలా రకరకాల వంటకాలు బాలామృతం ద్వారా వారు తెలిపారు. బాలామృతాన్ని పాలతో పాటు పిల్లలకు అందించాలని అలా తినని పిల్లలకు దానిని దోస రూపంలో కూడా తయారు చేసి అందిస్తే ఇష్టంగా తింటారని వారు పేర్కొన్నారు. అంగన్వాడీల ద్వారా నాణ్యమైన ఆహార పదార్థాలని పిల్లలకు అందిస్తున్నారని పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలు కూడా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బందితోపాటు కౌన్సిలర్ లు ప్రణీత రమాదేవి కాంగ్రెస్‌పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు రేణుక శివకుమార్ గౌడ్ సీనియర్ నాయకులు పొన్నగంటి మల్లయ్య శివ రాము నూతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట తహసిల్దార్ వెంకట్ రెడ్డికి పదోన్నతి...

**నిజాయితీ గల అధికారిగా గుర్తింపు...**
**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విధులు**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న నల్ల వెంకట్ రెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొందారు. గత సంవత్సర క్రితం జమ్మికుంట తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్ రెడ్డి నిజాయితీగల అధికారిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. తన వద్దకు వచ్చి సమస్యలను తెలిపిన రైతుల పట్ల కాని ప్రజాప్రతినిధుల పట్ల కానీ సానుకూలంగా స్పందిస్తూ వారి సమస్యను పరిష్కరిస్తూ పరి ష్కారం కాని సమస్యలకు ఎలా పరిష్కారం అవుతాయో సలహాలు ఇస్తూ అందరి మన్ననలు పొందారు. రెవెన్యూ శాఖలో అవినీతి ఎక్కువగా ఉంటుందని ప్రచారం జరుగుతున్న ఈరోజుల్లో జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయంలో తాను పనిచేసిన సంవత్సర కాలంలో నిజాయితీగా సేవలందించి అటు ఆఫీసు సిబ్బందితోపాటు మండల ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ఒక తాసిల్దార్ గానే కాకుండా జిల్లా తహసిల్దార్ సంఘం అధ్యక్షుడిగా కూడా వెంకట్ రెడ్డి తన సేవలను అందించారు. రాజకీయాలకు అతీతంగా నిక్కచ్చైన ఉద్యోగిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూ సంవత్సరం పాటు తన సేవలు అందించి పదోన్నతి పై వెళుతున్న ఆయనకు కార్యాలయ సిబ్బందితోపాటు పట్టణ మండల ప్రజలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సమస్యల పరిష్కారంలో ఒకటికి పనిచేసే రైతు మెచ్చిన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. తనతో పాటు తన కార్యాలయ సిబ్బంది కూడా అదే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచిస్తూ ఎవరి పట్ల కూడా అమర్యాదగా ఉండకూడదని కార్యాలయంకు వచ్చే ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ తన విధులు నిర్వహించారు. ప్రస్తుతం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీపై వెళ్తున్న ఆయన తిరిగి తన సేవలను హుజూరాబాద్ డివిజన్లో అందించాలని స్థానిక ప్రజలు కోరుకుంటు న్నారు. బుధవారం బదిలీపై వెళ్తున్న తహసిల్దార్ ను కార్యాలయ సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**తహసిల్దార్‌ను సత్కరించిన కౌన్సిలర్ ఫిరోజ్**

జమ్మికుంట తహసిల్దార్ వెంకట్ రెడ్డి పదోన్నతి బదిలీ పై వెళ్తుండగా జమ్మికుంట ఏడవ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఫిరోజ్ ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం కౌన్సిలర్ ఫిరోజ్ మాట్లాడుతూ సంవత్సరం కాలం పాటు నిజాయితీగా సేవలందించిన అధికారికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా ప్రమోషన్ రావడం సంతోషంగా ఉందని తాను ఎక్కడ పని చసిన ఇలాంటి సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# మహిళల ఆత్మగౌరవం పెరిగేలా ఇందిరమ్మ చీరలు

**ఇందిరమ్మ చీరల కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్**



**జమ్మికుంట, (సింగిడి):** పట్టణ ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా బుధవారం పట్టణంలోని బాలికల పాఠశా లలో మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కమి షనర్ మల్లికార్జున స్వామి హాజరై చీరల పంపిణీ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళ సంఘాలలోని సభ్యులకు, సంఘంలో లేని మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు ప్రతి వార్డులలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కాన్సిలర్స్ మొలుగు ప్రణీత, చుంచు రమాదేవి కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోనగంటి మల్లయ్య సలీం పాషా అరికెళ్ల స్రవంతి భానుచందర్ సి ఎల్ అర్పిలు జ్యోతి, మంజుల, అర్పిలు సరళ, విజయ, మాలతిలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం... యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

**మేయర్ శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పర్యవేక్షణలో చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు వేగవంతం**

**కరీంనగర్, (సింగిడి)**
కరీంనగర్ నగరంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. గాలివాన ప్రభావంతో ప్రధాన రహదారులు, అంత ర్గత వీధులు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో భారీ చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. కలెక్టరేట్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో స్మార్ట్ సిటీ వీధిదీపాల స్తంభాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలగా, విద్యుత్ తీగలు తెగిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల ఇళ్ల గోడలు కూడా కూలిపోయాయి. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు పారిశుధ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, సిబ్బంది, కార్మికులు అత్యవసర సహాయక చర్యలు చేపట్టారు. బుధవారం మేయర్, కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో విడివిడిగా పర్యటించి పరిస్థితులను పరిశీలించారు.



రహదారులకు అడ్డంగా పడిన చెట్లు, కొమ్మలను యంత్రాల సహాయంతో తొలగించగా, వంగిపోయిన వీధిదీపాల స్తంభాలను సరిచేసే పనులు చేపట్టారు. విద్యుత్ శాఖతో సమన్వయం చేస్తూ తెగిపోయిన తీగలను మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు వేగవంతం చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగర ప్రజలకు ఇబ్బందు లు కలగకుండా సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమించి సహాయక చర్యలను ముమ్మరం చేశారని తెలిపారు. అధికారులు, కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# వరదకాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

**మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత**



**జమ్మికుంట (సింగిడి):** జమ్మికుంటలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో (6వ వార్డు) వరద కాలువ నిర్మాణం చేపడతామని గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్లు హామీ ఇచ్చి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని వర్షం పడితే ఇండ్లలోకి నీరు చేరి నిత్యవసర సరుకులు మొత్తం పాడైపో తున్నాయని భయం భయంతో బతికే పరిస్థితి ఏర్పడుతుందని కొంతమంది విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా వరదలు కొట్టుకపోయినా సంఘట నలు ఉన్నాయని ఇప్పటికైనా హౌసింగ్ బోర్డ్ కాలనీ వరద కాలువపై ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని తీసుకోకపోవడం వల్ల పలు అనుమా నాలు ఉన్నాయని వరదాకాలపై ఆక్రమణకు పాల్పడి నోటీసులు ఎవరెవరికి ఇచ్చారో వాటిని భర్తరతం చేసి వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించి వరద కాలువ సమస్య పరిష్క రించాలని అలాగే హౌసింగ్ బోర్డ్ లో మోరీలు మొత్తం చెత్త మట్టితో నిండిపోయా యని వాటిని వెంటనే తొలగించాలనీ విజ్ఞప్తి అలాగే వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపు హౌసింగ్ బోర్డ్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని లేనిపక్షంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వినతి పత్రంలో పేర్కొన్నట్లుదీపూ హౌసింగ్ బోర్డ్ కాలనీ 6వ వార్డుఅధ్యక్షులు ఎండి జాహేద నసీరోద్దీన్ తెలిపారు.

# ధర్మపురిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**ధర్మపురి, ( సింగిడి):** ధర్మపురి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పలు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ బుధవారం శంకు స్థాపన చేశారు. పట్టణంలోని నూతన డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించ నున్న టాయిలెట్స్ పనులను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 13వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో అవసరమైన వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. కార్య క్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు చిపిరిశెట్టి రాజేష్, సంగి ఆనంద్, జంజిరికాని సువర్ణ, వొజ్జల లక్ష్మణ్, ముదుసుల ప్రశాంత్, అధికా రులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 41 అంశాలకు ఆమోదం

**హుజురాబాద్,(సింగిడి):** హుజురాబాద్ పురపాలక సంఘంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని అధ్యక్షతన సర్వ సభ్యసమా వేశం నిర్వహించారు. ఈసమా వేశంలో మొత్తం 41అంశాలను ప్రవేశపెట్టగా, పాలకవర్గం అన్నిఅం శాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమా వేశంలో పురపాలకసంఘ కార్యా లయ భవనంపై నూతన కౌన్సిల్‌హాలు నిర్మాణం కోసం రూ. 1.50కోట్లనిధుల మంజూరుకు ప్రభు త్వానికిప్రతిపాదనలు పంపాలని నిర్ణయిం చారు. అలాగే పట్టణంలోని 30వార్డుల్లో పలు అభివృద్ధి పనుల కోసం రూ. 2.50కోట్ల నిధుల మంజూ రుకు కూడా ప్రతిపాదనలు పంపనున్నారు. ప్రధా నరహదారుల మధ్యనున్న సెంట్రల్‌మేడియన్లలో విద్యుత్‌దీపాల మరమ్మతుల కోసం సాధారణ నిధుల నుంచి రూ. 5లక్షలు ఖర్చు చేయాలని కౌన్సిల్ ఆమోదించింది. బక్రీద్-2026 సంద ర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్ల కోసం



రూ. 2లక్షలను వినియోగిం చనున్నారు. పట్టణంలో దోమల నివారణ చర్యల్లో భాగంగా సాధారణ నిధులతో రూ. 1.49లక్షల వ్యయంతో రెండుకొత్త ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా పట్టణానికి మంచినీటి సరఫరా చేస్తున్న జోన్-1, జోన్-2 ట్రంక్ మెయిన్‌లలో తరచుగా ఏర్పడుతున్న లీకేజీల నివారణకోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 5 లక్షలతో ఎయిర్ వాల్వులు ఏర్పాటు



చేయాలని ఆమోదించారు. ఈ సమా వేశంలో వైస్ చైర్‌పర్సన్ గూడూరి అంజలి, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కమిషనర్ బి. కిషన్, మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ డి. కిరణ్, టెక్నికల్‌అధికారి నరేష్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అశ్వినీ గాంధీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఐ. రమేష్, జూనియర్ అకౌంటెంట్ సి. హెచ్. గోపాల్ రెడ్డి, వ్యవస్థాపన విభాగాధికారి పి. శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సొంత చెల్లెలే దొంగ: గుట్టురట్టయిన నకిలీ చోరీ డ్రామా!

**చాకచక్యంగా కేసులు ఛేదించిన హుస్నాబాద్ పోలీసులు**

**సీఐ శ్రీనివాస్ ఎస్ఐ లక్ష్మారెడ్డిని అభినందించిన ఎసిపి సదానందం**

**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ మండలం పోతారం (యస్) గ్రామంలో కలకలం రేపిన ఓ బంగారు ఆభరణాల చోరీ ఉదంతం చివరకు ఓ మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్‌తో సుఖాంతమైంది. బుధవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో, తన ఇంటి ముందు వరండాలో నిద్రిస్తున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన మెడలోని బంగారు పుస్తెల తాడు, చైన్ మరియు చెవి కమ్మలను ఎత్తుకెళ్లారని బాధితురాలు బొయిని మంజుల ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే హుస్నాబాద్ ఎస్.ఐ. లక్ష్మారెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని, బాధితురాలి నుంచి అక్కడికక్కడే (ఆన్ సైట్) దరఖాస్తు తీసుకుని కేసు నమోదు చేశారు. అయితే పోలీసుల శైలి విచారణలో అసలు నిజాలు



బయటపడటంతో అధికారులు సైతం షాక్‌కు గురయ్యారు. బాధితురాలి సొంత చెల్లెలు బొయిని విజయ భారతి, తన నాల్గవ అక్క కూతురైన ఒక మైనర్ బాలికతో కలిసి ఈ దొంగతనానికి స్కెచ్ వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2:30 గంటల సమయంలో మంజుల గాఢ నిద్రలో ఉండగా, విజయ భారతి వైర్ కట్టర్ సహాయంతో ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడు, చైన్‌ను అత్యంత చాకచక్యంగా కట్ చేసింది. ఆ తర్వాత ఈ నేరం బయటి వ్యక్తులు చేసినట్లు నమ్మించడానికి, ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు గాను.. తనతో పాటు ఉన్న మైనర్ బాలిక చెవి కమ్మలను కూడా తీసేసి డ్రామా ఆడారు. అనంతరం దొంగిలించిన మొత్తం సొమ్మును ఒక ప్లాస్టిక్ కవర్‌లో భద్రపరిచి, ఇంటి ముందు ఉన్న లంద గోళం కింద దాచిపెట్టారు. నిందితుల గుట్టు రట్టు చేసిన పోలీసులు విజయ భారతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కాగా, ఫిర్యాదు అందిన కొద్ది గంటల్లోనే కేసును అత్యంత వేగంగా ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో విశేష ప్రతిభ కనబరిచిన హుస్నాబాద్ సి.ఐ. కొండ్రు శ్రీను, ఎస్.ఐ. పాకాల లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు నీలం సంపత్, నంగునూరి నరేష్‌లను హుస్నాబాద్ ఎ.సి.పి. సౌడారపు సదానందం గారు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

# "పోష్ చట్టం" మహిళలకు భరోసా

**హక్కులపై అవగాహన కలిగి ధైర్యంగా ముందుకు రావాలి : మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్**



**ధర్మపురి, (సింగిడి):** మహిళలపై వేధింపుల నిరోధానికి రూపొందించిన పోష్ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణా ళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా మహిళల వారోత్సవాల సందర్భంగా బుధవారం ధర్మపురి పురపా లక సంఘం కార్యాలయంలో పోష్ యాక్ట్ -2013పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రభు త్వం పలు చట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్యాల యాలు, విద్యాసంస్థలు తదితర ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులను అరికట్టడంలో పోష్‌చట్టం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు సంగనభట్ల సంతోషి, విరవేణి నాగలక్ష్మి, జంజిరికాని సువర్ణ, కోఆప్షన్ సభ్యులు అశెట్టి మమత, గరిగే అరుణ, మెప్మా టీఎంసీ రాధా, మహిళా సంఘాల కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జమ్మికుంట మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

**రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించొద్దు మార్కెట్ కమిటీ పుల్లూరి స్వప్న సదానందం**



**జమ్మికుంట, (సింగిడి) :** జిల్లాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ అయినా జమ్మికుంట మార్కెట్ కు నాలుగు రోజులు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని శు క్రవారం లోకల్ హాలిడే ఉర్సు జాతర కొరకు మార్కెట్ యార్డ్ కు సెలవు ప్రకటించడం జరిగిందని అలాగే శని ఆదివారాలు వారాంతపు సెలవులు ఉన్నందున వరుసగా నాలుగు రోజులు మార్కెట్ బంద్ ఉంటుందని వారు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్కు తాము పండించిన ధాన్యాన్ని తీసుకొని రాకూడదని జూన్ ఒకటో తేదీ సోమవారం రోజున మార్కెట్ తిరిగి ప్రారంభమవుతుందని ఈ విషయాన్ని జమ్మికుంట పట్టణ మండల పరిసర ప్రాంత రైతులు వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు.

# గాంధీనగర్ 'ఊరచెరువు' మట్టి.. ఇటుకబట్టీల పాలు

పేరేమో రైతులది నల్ల మట్టి
పోయేదేమో ఇటుక బట్టీలకు
పోషకాలు కలిగిన మట్టి ఇటికబట్టిలకు
ఇందులో అధికారుల ప్రమేయం
ఏమైనా ఉందా...?
అక్రమ రవాణా చేసిన వారిపై చర్యలు
తీసుకుంటారా లేదా..!

**నల్ల మట్టి అక్రమ రవాణాపై నినాదం స్పెషల్ స్టోరీ..**



**హుస్నాబాద్ (సింగిడి);** హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో చెరువు నల్లమట్టి అక్రమ రవాణా దందా యథేచ్ఛగా సాగుతోంది. గత కొద్దిరోజులుగా గ్రామంలోని ఊర చెరు వులో ఉపాధి హామీ పనుల ద్వారా పూడికతీత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా వెలికితీస్తున్న, ఎంతో సారవంతమైన నల్లమట్టిని స్థానిక రైతుల పొలాల్లోకి తరలించి, వ్యవసాయ భూముల ఉత్పాదకతను పెంచా లనేది అసలు లక్ష్యం. అయితే, ఈ ప్రభుత్వ ఆశయం కాస్తా దారి తప్పి, కొంతమంది స్వార్థపరుల పాలిట కాసుల కురిపించే కామధేనువుగా మారింది. ఎన్నో రకాల సహజ పోషకాలు కలిగిన ఈ విలువైన మట్టిని స్థానిక రైతులకు చేర్చాల్సింది పోయి, కొందరు ట్రాక్టర్ యజమానులు గుట్టుచప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. రైతులకు పోస్తే తక్కువ ధర వస్తుందని, అదే ఇటుక బట్టీలకైతే భారీగా లబ్ధి పొందవచ్చనే ఆశతో, అధిక ధరకు అమ్ము కుంటూ సొంత లాభం చూసుకుంటున్నారు. రైతుల పేర్లు వాడుకుంటూ, పగలు రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా సాగుతున్న ఈ అక్రమ రవాణా స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. గతంలోనూ ఇదే తరహాలో చెరువు నుండి నల్లమట్టిని అక్రమంగా తరలించిన తరుణంలో అధికారులు కఠిన చర్యలు తీసుకు న్నప్పటికీ, కొద్దిరోజుల వ్యవధిలోనే అక్రమా ర్కులు మళ్లీ ఏమాత్రం జంకూ గొంకూ లేకుండా తమ పంథాను ప్రారంభించడం గమనార్హం.



మరోవైపు, ఇంత బహిరంగంగా చెరువు సంపద దోపిడీకి గురవుతున్నా, స్థానిక అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. కళ్లెదుటే విలువైన నల్లమట్టి ఇటుక బట్టీల పాలవుతుంటే, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు ముఖం చాటేయడం వెనుక ఉన్న అసలు మతలబు ఏం టనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం స్థానిక అధికారుల నిర్లక్ష్యమా లేక ఈ అక్రమ దందా వెనుక ఎవరైనా తెరవెనుక సూత్రధారులు ఉండి నడిపిస్తున్నారా అనే కోణంలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్ర స్థాయిలో కఠిన విచారణ జరిపించాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ రవాణాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసి, ఎంతో విలువైన ఈ నల్లమట్టిని ఇటుక బట్టీల పాలపడకుండా నిలువరించి, కేవలం నిజమైన లబ్ధిదారులైన స్థానిక రైతుల పొలాలకే చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# బక్రీద్ నమాజ్ ఏర్పాట్ల పరిశీలన

**శాంతినగర్, షాహలే నగర్ ఈద్గాలలో సౌకర్యాలపై కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజొద్దీన్ సమీక్ష**



**కరీంనగర్, (సింగిడి):** ఈదుల్ ఆధా (బక్రీద్) పర్వదినాన్ని పురస్కరించుకుని 28, 29, 30 తేదీల్లో జరిగే ప్రార్థనల ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకులు పరిశీలించారు. తొలి రోజు ప్రత్యేక నమాజ్ నిర్వహించనున్న శాంతినగర్, షాహలే నగర్ ఈద్గా ప్రాంగణా లను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, వాహన నిలుపుదల, ప్రథమ చికిత్స తదితర సౌకర్యాల ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం చైర్మన్ మహమ్మద్ తాజొద్దీన్ పరిశీలించి సంబం ధిత నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మైనారిటీ కాంగ్రెస్ నాయకులు నేహాల్ అహ్మద్, లేయిక్ ఖాద్రీ, అబ్దుల్ రహేమాన్, ఎండీ చాంద్, ఆమేర్, జమీలోద్దీన్, ఎండీ హనీఫ్, షాహీనష్, అజీం, జమీల్, సలీం, జమీర్, నూర్ పాల్గొన్నారు.

# నీటి గోస తీర్చండి మహాప్రభో...

**తాగునీరు లేక అరి గోస పడుతున్న 20 వ వార్డు ప్రజలు.. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజల వేడుకోలు..**

**జమ్మికుంట, (సింగిడి) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో ప్రజలకు తగినంత నీళ్లు రాకపోవడంతో నీరు లేక అరిగోస పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు మైనార్టీ సెల్ నాయకులు సలీం పాషా ఆవేదన వ్యక్తం చేశారు. తరాలు మారిన 20వవార్డు ప్రజల తలరాతలు మారడం లేదని జమ్మికుంట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో పన్నుల వసూలుచేయడంలో మొదటి స్థానంలో ఉందని తాగునీరు అందించే విషయంలో అట్టడుగు స్థానంలో ఉందని ఆయన అన్నారు. మండే ఎండలకు రోజురోజుకు నీటి సమస్య



పెరిగిపోతుందని ఎండాకాలం కావడంతో ప్రజల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. మిషన్ భగీరథ నీటి కోసం ప్రజలు గంటల తరబడి ఎదురుచూస్తున్నారని మున్సిపల్ ట్యాంకర్లు వచ్చినప్పటికీ సరిపడా నీళ్లు రావడంలేదని అధికారులు ఇప్పటికైనా స్పందించి మరికొన్ని ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని వారు మున్సిపల్ పాలకవర్గానికి తెలిపారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న ఇంటికొక ట్రిప్ నీరు సరిపోవడం లేదని నీరు లేనిదే ఏ పని జరగదని ప్రతి చిన్న అవసరానికి నీటి సమస్య ఎదురవుతుందని వెంటనే అధికారులు దృష్టి సారించి 20వ వార్డులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రభాతవేళ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
21-6-2026

# ఎడిటోరియల్

Editorial

## సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా...


మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడ మెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరనవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు



పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్స్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున - స్థిరసుఖ మాసనమ్- అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో - సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ - ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము - ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ - ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.-ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి - అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్**
**ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ**
**బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు**
**చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్**



**అమరావతి,జూన్20(సింగిడి):** దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా పక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్



శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

## యోగాస్త్రం

ఆది యోగి నుంచి..
ఏఐ మనిషి వరకు..
అల్బర్ట్ ఐన్‌స్టీన్ నుంచి..
నరేంద్ర మోదీ వరకు..
పరంపరగా సంక్రమించిన..
శరీరాన్ని చురకత్తిలా మార్చే..
మానవాళి ఆరోగ్య నగ..
అందరి చేతుల్లో మంత్రదండం
అమోఘ అమృత యోగాస్త్రం !

దృఢమైన శరీరం
ఈర్ష్యాజనక సౌష్టవం
మానసిక ఆహ్లాదం
గుండె నిండా ధైర్యం
చక్కటి చిక్కటి ఆరోగ్యం
సంపూర్ణ ఆయుష్షు భాగ్యం
అన్నీ గంపగుత్తగా దొరికే జాగా..
భారతావని అందించిన యోగ !

యోగాస్త్ర అలవాట్లు
శ్రేయస్సును వర్షించే వరాలు
యోగాసనాల అభ్యాసాలు
ప్రాణాయామ ప్రయోగాలు
ధ్యానాల మనో తపస్సులు
సకలం పరమాత్మ ప్రసాదాలు !

ఆత్మ శుద్ధికి చిరునామాలు
ప్రశాంతతకు రాజమార్గాలు
ఒంటికి వ్యాయామ యోగాలు
ఉచ్ఛ్వాస నిశ్వాసాలపై పెట్టే గురి
కదలికల్ని అదుపు చేసే మది
బహిష్కరించు ఆరోగ్యాల సిరి !

మధుపాళీ
9948700037



## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,జూన్20(సింగిడి):** శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 220 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 200 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 170 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,080 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,33,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,09, 560 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# గోదావరి తీర గాన గంధర్వుడు... స్వరార్చనల జగదీశ్వరుడు

తెలుగునాట సంగీతం అనేది కేవలం ఒక కళ మాత్రమే కాదు, అది హృదయాలను కదిలించే ఒక భావ సాధన, పరమాత్మను చేరే ఒక ఉపాసనా మార్గం. అటువంటి పవిత్రమైన గాన కళను నమ్ముకుని, దాదాపు మూడు దశాబ్దాలుగా నిరంతర శ్రద్ధతో, అపారమైన భక్తితో తెలుగు స్వర సామ్రాజ్యంలో తన కంటూఒక విశిష్టమైన స్థానాన్ని, విభిన్నమైన శబ్దస్వర రూపాన్ని సంపాదిం చుకున్న అరుదైన ప్రతిభాశాలి డాక్టర్ గుండి జగదీశ్వర్ శర్మ. జూన్ 21న ప్రపంచ సంగీత దినోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించు కుని, ఆయన సమగ్ర గాన ప్రస్థానాన్ని, సాధించిన అపూర్వ మైలురాళ్లను విశ్లేషించుకోవడం తెలుగు సంగీత పరంపరకు మనం అందించే ఒక సముచిత గౌరవం.

ఏ కళాకారుడి ప్రస్థానానికైనా ఆయన జన్మించిన నేల, పెరిగిన వాతావరణం బలమైన పునాదులుగా నిలుస్తాయి. జగదీశ్వర్ శర్మ విషయానికి వస్తే, ఆయన దక్షిణకాశీగా, నవ నరసింహ క్షేత్రాలలో ఒకటిగా, హరిహర బ్రహ్మ సమేత త్రైమూర్త్య పుణ్యభూమిగా విరాజిల్లుతున్న పవిత్ర గోదావరి నదీ తీర ధార్మిక క్షేత్రమైన ధర్మపురిలో జన్మించారు. గుండి హరిప్రియ, హన్మాండ్లు దంపతుల కడుపున జన్మించిన ఆయనకు బాల్యంలోనే ధర్మపురి క్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం, నిత్య వేదమంత్రాల ధ్వనులు, గుడి గంటల రవళులు సంగీతం పట్ల అమితమైన మక్కువను, లోతైన సంస్కారాన్ని కలిగించాయి. తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం తోడవడంతో, చిన్నతనం నుంచే కఠోరమైన పట్టుదలతో స్వర సాధన ప్రారంభించి, గాత్ర సరస్వతి కృపాకటాక్షాలను సొంతం చేసుకున్నారు.

జగదీశ్వర్ శర్మ గాన ప్రయాణం కేవలం ఒక అభిరుచిగా సాగలేదు. అఖండమైన సాధనతో రేడియో, టెలివిజన్ మాధ్యమాలలో తన ప్రతిభను చాటుకుంటూ ఆయన విస్తృతమైన గుర్తింపు వైపు అడుగులు వేశారు. టెలివిజన్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఈటీవీ 'పాడుతా తీయగా' కార్యక్రమం ఆయన జీవితంలో ఒక మైలురాయి. ఆ వేదికపై గానగంధర్వుడు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో క్లిష్టమైన గీతాలను సైతం అత్యంత అద్భుతంగా ఆలపించి బాలు గారి హృదయాన్ని గెలుచుకున్నారు. అంతటితో ఆగకుండా, జెమినీ టీవీ నిర్వహించిన ప్రతిష్టాత్మక 'నవరాగం' మ్యూజిక్ రియాలిటీ షోలో సెమీఫైనల్ వరకు దూసుకెళ్లి, లెజెండరీ గాయకుడు ఎస్పీబీ ఆశీస్సులు పొందిన మొట్టమొదటి తెలంగాణ గాయకుడిగా సరికొత్త రికార్డు సృష్టించారు.

ఒక వైపు టెలివిజన్ వేదికలపై రాణిస్తూనే, మరోవైపు చలనచిత్ర సంగీత ప్రపంచంలోని దిగ్గజాలైన కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పి. పాట్నాయక్ వంటి ప్రముఖ సంగీత దర్శకుల ఆధ్వర్యంలో నడిచే ఆర్కెస్ట్రాలలో ముఖ్య గాయకుడిగా వ్యవహరించారు.వారి ప్రశంసలు అందుకోవడం ద్వారా తన స్వర పరిణతిని మరింత పెంచుకున్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో, ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాలలో 1600కు పైగా ప్రత్యక్ష సంగీత విభావరులు (లైవ్ కచేరీలు) నిర్వహించడం ఆయన అసాధారణ కార్యదీక్షకు, అంకితభావానికి నిదర్శనం. ప్రతి కచేరీలోనూ శాస్త్రీయ సంగీత పునాదులను వీడకుండా, భక్తి భావనను, జానపద శైలిని మేళవించి శ్రోతలను మంత్రముగ్ధులను చేయడం ఆయన ప్రత్యేక శైలి.




గడిచిన 26 సంవత్సరాలకు పైగా సాగుతున్న ఈ సుదీర్ఘ గాన సేవలో ఆయన అందుకున్న పురస్కారాలు, సాధించిన ఘనతలు గణనీయమైనవి. జగదీశ్వర్ శర్మ ప్రతిభను గుర్తిస్తూ వివిధ సాంస్కృతిక సంస్థలు, ప్రభుత్వ విభాగాల నుంచి ఇప్పటివరకు 135కు పైగా అవార్డులు లభించాయి. అందులో అత్యంత విశిష్టమైన విషయం ఏమిటంటే, ఆయన ఆరాధించే గానగంధర్వుడు ఎస్. పి. బాల సుబ్రహ్మణ్యం పేరిట 3సార్లు, గాయక సార్వభౌమ ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట రెండు సార్లు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకోవడం. ఇవి ఆయన గాత్ర వైభవానికి అద్దం పడతాయి. ప్రాంతీయంగా ఆయనకు లభించిన తెలంగాణ రత్న, ప్రతిభా రత్న పురస్కారాలతో పాటు, నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ జాతీయ స్థాయిలో ఆయనను 'బెస్ట్ సింగర్'గా ప్రకటించి గౌరవించడం ఆయన కీర్తిని దేశ రాజధా నికి సైతం విస్తరింపజేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఆయన సాధించిన రికా ర్డులు కూడా తక్కువేమీ కావు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్, అలాగే జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్ వంటి అంతర్జాతీయ వేదికలు ఆయనను ఉత్తమ గాయకుడిగా గుర్తించి తమ రికార్డుల్లో స్థానం కల్పించడం తెలుగు జాతికి గర్వకారణం.

ఆయన సంగీత ప్రస్థానంలో అన్నింటికంటే మహోన్నతమైన ఘట్టం 2021లో ఆవిష్కృతమైంది. జగదీశ్వర్ శర్మ సమాజానికి, కళారంగానికి చేసిన సుదీర్ఘమైన నిరుపమాన సేవలను గుర్తించిన ప్రతిష్టాత్మక ఢిల్లీ విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటిం చింది. నాటి భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ గౌరవ డాక్టరేట్ పట్టాను స్వీకరించడం ఆయన జీవితంలోనే కాక, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాంస్కృతిక చరిత్రలో చిరస్మరణీయమైన అధ్యాయంగా నిలిచిపోయింది. దీనికి అదనంగా, ఇటీవల ఉగాది పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని చారిత్రాత్మక త్యాగరాయ గాన సభలో స్వరమాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సభలో, ఆయనకు 'స్వర్ణ నంది ఉగాది పురస్కారం' ప్రదానం చేశారు. ఇది ఆయన కెరీర్‌లో లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం విశేషం.

జగదీశ్వర్ శర్మ కేవలం సినిమా పాటలకో, లలిత గీతా లకో పరిమితం కాలేదు. మన సనాతన సంస్కృతికి, ఆధ్యాత్మి కతకు, జానపద సంప్రదాయాలకు తన స్వరంతో ప్రాణం పోశారు. దాదాపు 100కు పైగా భక్తిరస ఆడియో సీడీల (ఆల్బమ్స్) ద్వారా వినాయక భక్తి గీతాలు, శ్రీరామ కీర్తనలు, ఆంజనేయ స్వామి స్తోత్రాలు, శృంగేరి శారదాంబ వైభవ గీతా లు, అలరించే జానపద గజ్జెల రవళి వంటి ఎన్నో అద్భుతమైన పాటలను ప్రజ ల్లోకి తీసుకెళ్లారు.ముఖ్యంగా ఆయన పుట్టినగడ్డ అయిన ధర్మపురి క్షేత్ర మహి మను చాటే పవిత్రమైన 'ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ శతకం' కీర్తనలను తన గంభీ రమైన కంఠంతో ఆలపించి, ఆ క్షేత్ర వైభవాన్ని ఆధ్యాత్మిక లోకానికి మరింత చేరవేశారు.

ఈ నిరంతర స్వరార్చనకు అత్యున్నత గుర్తింపుగా, 2026 జూన్ 13న హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సరేగా ప్రధాన మందిరంలో జరిగిన 'పాడుతా తీయగా' ప్రత్యేక సంగీత మహోత్సవంలో జగదీశ్వర్ శర్మకు ఒక అరుదైన, అపూర్వమైన అవకాశం దక్కింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ సుదీర్ఘ సంగీత విభావరిలో, వేలాది మంది గాయకుల నుంచి వడపోసి ఎంపిక చేసిన అత్యంత ప్రతిభావంతుల్లో జగదీశ్వర్ శర్మ ఒకరిగా నిలిచారు. సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల వరకు సాగిన ఆ వేడు కలో, బాలు గారు పాడి అమరత్వం కల్పించిన 5 అత్యంత కఠినమైన, మధురమైన గీతాలను ఆయన అద్భుతంగా ఆలపించి శ్రోతలను, ప్రముఖులను పరవశింపజేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ సీనియర్ సినీ నటుడు సుమన్, అద్భుత నటనతో అలరించిన మాజీ మంత్రి, నటుడు బాబూమోహన్‌తో పాటు పలువురు సినీ సంగీత దర్శకులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు జగదీశ్వర్ శర్మను శాలువాలతో, స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు. ఒకప్పుడు ఏ మహానుభావుడి ముందు విద్యార్థిగా నిలబడి పాడుతా తీయగా వేదికపై ప్రశంసలు అందుకున్నారో, నేడు అదే బాలు గారి జయంతి వేదికపై ఆయన పాటలనే స్మరిస్తూ స్వర నివాళి అర్పించే స్థాయికి ఎదగడం జగదీశ్వర్ శర్మ సాధించిన ఆత్మిక విజయానికి ప్రతీక.

సంగీతాన్ని కేవలం ఒక వృత్తిగానో, జీవనోపాధిగానో భావించకుండా, దాన్ని ఒక నిరంతర తపస్సుగా, భగవదారాధనగా మలచుకున్న కళాకారులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారు. సాధన, శ్రద్ధ, వినయం, నిరంతర అభ్యాసం అనే నాలుగు సుగుణాల పునాదులపై డాక్టర్ గుండి జగదీశ్వర్ శర్మ గాన సామ్రాజ్యం నిర్మితమైంది. అందుకే ఆయన పాడే ప్రతి పాటలోనూ ఒక గంభీరత, స్వరంలో ఒక అనిర్వచనీయమైన మాధుర్యం, భావవ్యక్తీకరణలో అచ్చమైన సహజత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. ఆయన గాత్రం కేవలం వినోదాన్ని పంచే శబ్దం కాదు; అది వినేవారి హృదయంతరాళాలను స్పృశించే ఒక అద్భుత అనుభూతి. తెలంగాణ మట్టిలో నుంచి ఉద్భవించి, గ్రామీణ ప్రతిభను అంతర్జాతీయ వేదికల వరకు తీసుకెళ్లిన ఆయన జీవన ప్రస్థానం, నేటి తరం యువ గాయకులకు, భవిష్యత్తులో రాబోయే తరాల కళాకారులకు ఒక గొప్ప దిక్సూచి, ప్రేరణాత్మక ఆదర్శం. ప్రపంచ సంగీత దినోత్సవం వేళ, ఈ స్వర యోధుడు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తన గాన మాధుర్యంతో తెలుగు సంగీత వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షిద్దాం.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్**
**జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు

## కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ ప్రతినిధి, జూన్ 20 (సింగిడి):** జిల్లాలోని పేద ప్రజ లందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్స కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.





రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పక్కాగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి ఉదారతను చాటిన వాసాల శ్రీలత శ్రీనివాస్ దంపతులు

కీ.శే.వాసాల సత్తమ్మ, మహంకాళి జ్ఞాపకార్థం ప్రతిభ పురస్కారాలు
పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు
వాసాల దంపతులు 11 వేల నగదుపురస్కారం అందజేత





**సుల్తానాబాద్, జూన్ 20 (సింగిడి):** నాలుగవసారి పదిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు వాసాల శ్రీలత శ్రీనివాస్ దంపతులుఅందజేసి మానవత్వానికి ప్రతిరూపంగా నిలుస్తూ మరోసారి ఉదారతను చాటారు. శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కీర్తిశేషులు వాసాల సత్తమ్మ మహంకాళి జ్ఞాపకార్థం నగదు ప్రతిభ పురస్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య హాజరయ్యారు. 2025-26 సంవత్సరం పదవ తరగతి లో ప్రభుత్వ పాఠశాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థిని,విద్యార్థుల కు వాసాల సత్తమ్మ మహంకాళి జ్ఞాపకార్థం వారి కుమారుడు వాసాల శ్రీలత శ్రీనివాస్ దంపతులు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య, ప్రధానో పాధ్యాయులు రత్నాకర్ రెడ్డి తోకలిసి ఇద్దరు మం డల టాపర్లకు 5వేలు, మరో ఆరుగురికి 6వేల రూ పాయల నగతు పురస్కారాలతో పాటు శాలువా తో సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆరేపల్లి రాజయ్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేసినందుకు వాసాల శ్రీనివా స దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్య క్రమంలో సామాజిక సేవకుడు తుమ్మ రాజ్ కుమార్, తోపాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**మంచిర్యాల, జూన్20 (సింగిడి):** ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని శ్రీరాం పూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడు కల నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా శని వారం యోగా డే ను నిర్వహించారు. ఇందు లో భాగంగా శ్రీరాం పూర్ ఏరియా జీఎం కార్యాలయంతో పాటు ఏరియా వ్యాప్తంగా అన్ని గనులు , కార్యాలయాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. అధికారులు , ఉద్యోగులు యోగా ఆసనాలు సాధన చేశారు. జనరల్ మేనేజర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీ మునిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఫైనాన్స్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సౌందర్య పర్యవేక్షణలో యోగా ఆసనాల సాధన చేశారు. అన్ని విభాగాల అధిపతులు, అధికారులు , ఉద్యోగులు, సిబ్బంది యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా అనేది ఒక భాగంగా మారాలి అన్నారు . శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో ప్రధానం అన్నారు. మనదేశంలో పుట్టిన వేద ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందుతున్న యోగా సాధన విషయంలో మనం కొంత వెనకబడడం దురదృష్ట కరం అన్నారు. జిమ్ , ఇతర ఆధునాతన మార్గాలకంటే సులువైనది , విలువైనది ఇంట్లోనే కొంత సమయం వెచ్చిస్తే మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందగలిగేది యోగా ద్వారానే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్ . సత్యనారాయణ , గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ అధ్యక్షులు . వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, డీజీఎం(పర్సనల్) ఎస్ . అనిల్ కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(ఫారెస్ట్) హరినారాయణ, ఏఎస్ఓ విజయ్ కుమార్, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, సర్వే ఆఫీసర్ చంద్రశేఖర్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ క్రాంతి కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం సహించేది లేదు

## కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి, జూన్ 20 (సింగిడి):** ప్రజల నుంచి వచ్చే అన్ని రకాల రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదా బైనామా, ప్రజావాణి అర్జీలు, పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా భూభారతి, ప్రజావాణి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం 60 రోజుల గడువు నిర్దేశించిందని, ఈ గడువులోపే ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పౌర సేవల కింద జారీ చేసే కులం, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హులైన వారికి వెంటనే ఆమోదం తెలపాలని తహసీల్దార్లకు స్పష్టం చేశారు. దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితి ఏర్పడితే, సంబంధిత కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డి ఆర్ ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఒత్తిడిని జయించే అద్భుత సాధన యోగా

## ఐపీఎస్ అధినేతలు మాటేటి కృష్ణప్రియ, సంజీవ్ కుమార్



**సుల్తానాబాద్, జూన్ 20(సింగిడి):** యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిం చడంతో పాటు ఒత్తిడిని జయించే అద్భుత సాధ నమని ఐపీఎస్ అధినేతలు మాటేటి కృష్ణప్రియ సంజీవ్ కుమార్ లు స్పష్టం చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భం గా శనివారం పాఠశా లలో ఘనంగా యోగ డే వేడుకలు. నిర్వహించా రు. యోగా శిక్షకులు, పీఈటీలఆధ్వర్యంలో విద్యా ర్థులతో సూర్య నమ స్కారాలు, పద్మాసనం, చక్రాస నం, భుజంగాసనం, హలాసనం తదితర యోగాస నాలు చేయించారు. ఈ సంద ర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రి య మాట్లాడుతూ యోగా ద్వారా శరీర దారుఢ్యం తో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగు తాయని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారాఆరోగ్య వంతమైన జీ వనాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు సత్యం, సతీష్, జ్యోతి, మేనేజర్ శివ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో మా కుమారుడిని జైలుకు పంపారని తల్లిదండ్రుల ఆరోపణ



**పెద్దపల్లి రూరల్,జూన్ 20(సింగిడి):** జిల్లాలో స్థానికంగా సంచలనం రేకెత్తించిన ఈర్ల సురేందర్ కొడుకు బావిలో పడి మృతి చెందిన ఘటనలో, మా అబ్బాయి సాయి చరణ్ పై అక్రమంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని అతని తల్లిదండ్రులు కుక్క రవి,అనురాధ ఆరోపించారు. శనివారం జిల్లా న్యాయస్థానం వద్ద తల్లిదండ్రుల మీడియాతో మాట్లాడారు. వారు తెలిపిన వివరాల ప్రకారం,ఈర్ల సురేందర్ కుమారుడు గత ఏడాది నవంబర్ 13 2025 రోజున పెద్దపల్లి పట్టణం బంధంపల్లి వద్ద బావిలో పడి మృతి చెందాడని తెలిపారు. ఆ ఘటనకు సంబంధించి తమ కుమారుడు సాయి చరణ్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా, సురేందర్ తన ప్రభావాన్ని ఉపయోగించి తప్పుడు కేసులు నమోదు చేయించారని వారు ఆరోపించారు. మా కుమారుడిని అన్యాయంగా,అక్రమంగా కేసుల్లో ఇరికించి ఈరోజు జైలుకు పంపించారు. రాజకీయ,ఆర్థిక పలుకుబడితో ఎన్ని కేసులు పెట్టినా మాకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. రానున్న రోజుల్లో న్యాయస్థానం నిజానిజాలను వెలికితీసి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాం అని సాయి చరణ్ తల్లిదండ్రులు పేర్కొన్నారు.

# లోక్ అదాలత్‌తో సమన్యాయం

## జడ్జి దుర్గం గణేశ్



**సుల్తానాబాద్, జూన్ 20(సింగిడి):** లోక్ అదాలత్ లతో ఇరు వర్గాలకు సమన్యాయం అందుతుందని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భం గా శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదా లత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారం తో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు వ్యయ ప్రయా సలకు గురికాకుండా ఇరు వర్గాలు రాజీ ద్వారా తమ కేసులను పరిష్క రించుకో వాలని సూచించారు . లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివా దాలు, భూమి తగాదాలు, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించిన పలు కేసుల ను పరిష్కరించారని కోర్టు అధికా రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు, చీకటి సంతోష్, న్యాయవాదులు ఆవుల లక్ష్మీ రాజం, భూసారపు బాలకిషన్ ప్రసాద్, పడాల శ్రీరాములు, జోగుల రమేష్ , ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేష్, సిఐ రంజిత్ రావు, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడ్ ఎస్సైలు చంద్ర కుమార్, మ ధు,మల్లేష్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ చివరి మాసం వరకు బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలి

మండల విద్యాధికారి అరేపల్లి రాజయ్య
ఉపాధ్యాయులకు
సంసిద్ధత కార్యక్రమాలపై అవగాహన



**సుల్తానాబాద్, జూన్20 (సింగిడి):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ చివరి మాసం వరకు బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించాలని మండల విద్యాధికారి ఆరేపల్లిరాజయ్య తెలిపారు. శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోమండలం ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయు లకు మండల విద్యాధికారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజయ్య మాట్లాడుతు, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జూన్ మాసం చివరి వరకు బ డిబాట కార్యక్రమాలు కొనసాగించాలనితెలిపారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలో స్థానిక ప్ర జా ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షు లు, సభ్యుల సహకారంతో ఎన్రోల్మెంట్ పెంచాలని సూచించారు. అలాగే ఆదివారం నుండి 45 రోజుల వరకు పాఠశాలలో సంసిద్ధత కార్యక్ర మాలు ని ర్వహించాలని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా పౌష్టికాహారం అందించాలని సూచించా రు. ఉపాధ్యాయుల విద్యార్థుల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సకాలంలో క్యాప్చర్ చేయాలని తెలియజేశారు. ఫౌండేషనల్ లిటరేసి అండ్ న్యూమ రసిలో భాగంగా విద్యార్థుల యొక్కసామర్థ్యాలను గుర్తించి జూలై మొదటి వారంలో బేస్ లైన్ పరీక్ష కండక్టు చేసి ఆన్ లైన్ లో నమోదు చేయవలెనని తెలిపారు.

కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్ర ధానోపాధ్యాయులు టి. దివాకర్, ఎస్. రత్నాకర్ రెడ్డి, వి. కవిత తో పాటు మండలంలోని అన్ని పా ఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్,ఎంఐఎస్, సిసిఓలు పాల్గొన్నారు.

# సారంగాపూర్ మండలంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎంపీ ఓఅజీజ్ ఖాన్



**నిర్మల్ ప్రతినిధి/సారంగాపూర్, జూన్20(సింగిడి):** సారంగా పూర్ మండలంలోని ధని గ్రామంలో మంజూరైన ఇందిర మ్మ ఇండ్ల స్థలాలను సక్రమ పద్ధతిలో లబ్ధిదారులకు అందిం చే లక్ష్యంగా పరిశీలించినా ఎం పి ఓ అజీజ్ ఖాన్. క్షేత్రస్థా యిలో వెళ్లి ఇండ్లను స్థలాన్ని పరిశీలించి జియో ట్యాగింగ్ చేయడం జరిగింది. ఈ విధంగా గ్రామం లోని ఏడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి పత్రాలను పరిశీలించి ఇండ్ల ను డిజిటలీకరణలో నమోదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బడిపోతన్న, పంచాయతీ కార్యదర్శి కిరణ్, కారోబారి రమేష్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడికి పంపవద్దని బోరిగం తండా గ్రామస్తుల తీర్మానం



**లక్ష్మణ్ చందా: జూన్ 20 (సింగిడి):** లక్ష్మణ చందా మండలంలోని బోరిగా తండా గ్రామస్తులు ప్రైవేటు బడికి పిల్లల్ని పంప వద్దని ఏకగ్రీవ తీర్మానం చేశారు . ప్రైవేట్ బడి బస్సును ఊరిలోకి రానీయవద్దని తీర్మా నించారు. శనివారం మండలంలోని బోర్గాం తాండ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠ శాలలో గ్రామస్తులు ప్రత్యేక సమా వేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు గ్రామం లోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు అందరూ ముక్తకంఠంతో తీర్మానించారు . ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి అశోక్ వర్మ , గ్రామ ఉపసర్పంచ్ శ్రీ వసంతరావు, తాండ నాయకులు శ్రీ రాథోడ్ సంతోష్ నాయక్, శ్రీ ప్రేమ్ దాస్ భానుచందర్ ,భాస్కర్ నాయక్ ,నరేందర్ ,రామ్ రామచంద్ర , తల్లిదండ్రులు ,గ్రామస్తులు ,గ్రామ యువకులు, డ్వాక్రా మహిళలు మహిళలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ ఉపాధ్యాయిని భాగ్యలక్ష్మి అంగన్వాడి టీచర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 కోట్ల 50 లక్షల నిధులతో గ్రామాల్లో గోదాముల నిర్మాణం

## ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



**నిర్మల్ ప్రతినిధి/భైంసా, జూన్ 20 (సింగిడి):** గ్రామాల్లో రైతాంగానికి ఇబ్బందులు కలుగకుండా పండించిన పంటను నిల్వ చేసుకోవ డానికి ముధోల్ నియోజకవర్గం లోని 35 గ్రామాల్లో ఒక్కోదానికి 30 లక్షల రూపాయల నిధులతో గోదా ములను నిర్మించడానికి నిధులు మం జూరు చేయించారు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్. 10 కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో ఈ పనులు జరగనున్నాయి. ముధోల్ నియోజకవర్గం లో గతంలో ఎన్నడు లేనివిధంగా అభివృద్ధి పనులు జరు గుతున్నాయి. "గత పది సంవత్సరాల పాలకుల పాలనలో నియోజక వర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా, అధికారం లో ఉండగా (అభివృద్ధిని పక్కన పెట్టి సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకుని ) వెనుక పడగా, ఎమ్మెల్యే పటేల్ ప్రత్యేక దృష్టి సాధించడంతో పెద్ద మొత్తంలో నిధులు వస్తున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బాసర మండ లంలోని టాక్లి, కిర్గుల్ కే, భైంసా మండలంలోని బిజ్జూర్, వానలపాడ్, మహాగాం, కుంసర, ఇలేగామ్, కుబీర్ మండలంలోని పార్డి బి, పార్డి కే, పల్సి, హంపోలి, కుంటాల మండలంలోని లింబకే, లింబా బి, విట్టాపూర్, పెంచికల్ పాడ్, ఓలా, లోకేశ్వరం మండలంలోని ధర్మోరా, పిప్రి, అబ్దుల్లాపూర్, కనకాపూర్, నరసింహనగర్ తాండ, ముధోల్ మండలంలోని గన్నోరా, ముద్గల్, బోరిగాం, అష్ట, రాంటెక్, నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్, డోంగు ర్ గావ్, నందన్, తానూర్ మండలం లోని బోరిగావ్ బామ్ని, బొంద్రట్, భోసి, బెల్ తరోడా, గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి.

# ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణపై విస్తృత అవగాహన కల్పించాలి

## 2కే రన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె. హరిత

## జిల్లా వ్యాప్తంగా 678 పోలింగ్ కేంద్రాల్లో సర్వే



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి జూన్ 20 (సింగిడి) :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని జిల్లా కలెక్టర్ కె. హరిత పిలుపునిచ్చారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వం-కు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం కలెక్టరేట్ భవన సముదాయం నుంచి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 678 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతో పాటు మార్పులు, చేర్పులను సక్రమంగా చేపట్టాలని సూచించారు. బీఎల్ఓ యాప్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు. ఓటరు నమోదు అనేది ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, విద్యార్థులు సహకరించాలని కోరారు. ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచడంలో మీడియా పాత్ర కీలకమని, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ 2కే రన్‌లో జిల్లా స్థాయి అధి కారులు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, యువజన సంఘాల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రంప్ పేరుపై సీఐటీయూ గుస్సా

సుల్తానాబాద్ లో నల్ల జెండాలతో నిరసన.. జిల్లా కార్యదర్శి ఎరవల్లి ముత్యం రావు



**సుల్తానాబాద్, (సింగిడి):** హైదరాబాదులోని ఫైనాన్స్ డిస్టిక్ నానక్ రామ్ గూడ లో ని అమెరికా కాన్సులేట్ వద్ద రోడ్డుకు అ మెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెట్టడాన్ని వ్య తిరేకిస్తూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో సు ల్తానాబాద్ కెనాల్ వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్య దర్శి ఎరవల్లి ముత్యంరావు మాట్లాడుతూ, అమె రికా సామ్రాజ్యవాదం అకారణమైన యుద్ధలను సృష్టించి అనేక లక్షల మంది ప్రాణమానాలను హ రించి వేస్తూ, ఆంక్షలు పేరుతో భారతదేశంపై అనేక ఆర్థిక భారాల మోపతూ దానితో దేశంలోని పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అనేక అవస్థలకు కారణమవుతున్న అమెరికా అధ్యక్షుడు డో నాల్డ్ ట్రంప్ పేరును మన రాష్ట్ర రాజధాని లో ఒక రోడ్డుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టడాన్ని సిఐటియు వ్యతిరేకిస్తుందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త న తప్పుడు నిర్ణయాన్ని ఉపసంహ రించు కోవాల ని అన్నారు. ఆయన చేస్తున్న దుర్మార్గాలకు అమె రికాలోనే వ్యతిరేకత వస్తుందని, అట్లాంటి ప్రజా వ్యతిరేకి ఆయన ట్రంప్ పేరును పెడితే ప్రభుత్వం పై కూడా ప్రజల తిరుగుబాటు మొదలవుతుంద ని హెచ్చరించారు. నాయకులు రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు తాండ్ర అంజ య్య, రైస్ మిల్ మస్తాల సంఘ అధ్యక్షులు, మాతంగి రాజమల్లు, ఉపా ధ్యక్షుడు బండారి తిరుపతి, బ్రహ్మచారి, రాజయ్య, ఓదెలు, ప్రసాద్, రమేష్, మల్లేష్, శీను, సతీష్, శ్రీకాంత్, రవీం దర్, శివ, రాజు, వెంకటేష్, మ హేందర్, రవి, సది, శి వప్రసాద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యం

వ్యవసాయ బడ్జెట్‌ను 5 రెట్లు పెంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదే
ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించండి
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్





**జమ్మికుంట, జూన్20 (సింగిడి):** కిసాన్ సమ్మాన్ నిధి లబ్దిదా రుల్లో 92శాతం మంది రైతులు ఆ సొమ్మును సద్వినియోగం చేసుకుంటున్నా రని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ య్ కుమార్ తెలిపారు. తద్వారా రైతుల ఆదాయం పెరుగు తోందన్నారు గ్యారంటీ లేని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాడుకునే పాలకులు ఉన్న నేటి రోజుల్లో అందుకు భిన్నంగా గత ఏడేళ్లుగా క్రమం తప్పకుండా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పైసలను రైతుల ఖాతాల్లో జమ చేస్తు న్న ఘనత నరేంద్రమోదీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కేవీకేలో నిర్వహించిన 23వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా కిసాన్ సమ్మాన్ నిధిని రైతుల ఖాతాల్లో జమ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని వర్చువల్ ద్వారా తిలకించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి నుండి నేటి వరకు రైతుల ఖాతాల్లో రూ. 5 లక్షల కోట్లకుపైగా జమ చేశారు. ఒక్కవిడత కూడా లేట్ చేయలేదు. దేశవ్యాప్తంగా 9 కోట్ల 44 లక్షల మంది రైతులు లబ్ది పొందుతున్నారు. 23వ విడత కింద 18 వేల 880 కోట్లనిధులు విడుదల య్యాయి. 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్ ను ఏకంగా 5 రెట్లు పెంచారు. 11 లక్షల కోట్ల రూపాయలతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది బడ్జెట్ లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి 1 లక్షా 40 వేల 529 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది .గత ఏడాదితో పోలిస్తే 5 శాతం కేటాయింపులు పెంచాం. కేంద్ర బడ్జెట్ 2026-27లో పీఎం కిసాన్ కోసమే 60 వేల కోట్ల రూపాయలు కేటాయిం చారు. 25 కోట్ల మందికి భూసార పరీక్షల కార్డులను అందించా రు. రైతుల రుణ పరిమితిని ఈ ఏడాది నుండి 5 లక్షల రూపా యలకు పెంచారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద బీమా కంపెనీల ద్వారా 1 లక్షా 75 వేల కోట్ల పరిహారాన్ని అందిం చారు. 7 కోట్ల 70 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందించి 10 లక్షల కోట్ల రూపాయల క్రెడిట్ మద్దతు కల్పించారు. రైతు లక్ష రూపాయల లోన్ తీసుకుంటేఏడాదికి వడ్డీతో కలిపి 1 లక్షా 4 వేల చెల్లిస్తే సరిపోతుంది. మన తెలంగాణలోనూ దాదాపు 40 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చి దాదాపు 50 వేల కోట్ల రుణాలను అందిస్తున్నాం ము ఖ్యంగా రైతులకు కనీస మద్దతు ధరను యూపీఏ పాలనతో పోలిస్తే దాదాపు రెట్టింపు చేశారు. 25 కోట్ల మంది రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చారు. మన తెలంగాణలో 1 కోటి 10 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు అందించారు. ప్రకృతి వ్యవసాయం మళ్లితే తొలి పంట ఆదాయం రాకపోయినా, ఆ తరు వాత వేసేపంటల స్వీలాభదాయకంగా మారతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో కెవికె సెక్రెటరీ విజయ గోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, శాస్త్రవేత్తలు, వెంకటేశ్వర్లు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## టీవీఆర్ మోడల్ హై స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ఉత్సాహంగా యోగా వేడుకల్లో పాల్గొన్న పాఠశాల చిన్నారులు





**కుత్బుల్లాపూర్, జూన్ 20 (సింగిడి):** కుత్బుల్లా పూర్ నియో జక వర్గం సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీలోని టీవీఆర్ మోడల్ హైస్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనం గా నిర్వహించారు. టీవి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణారెడ్డి నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ యోగా దినోత్సవ కార్యక్రమా నికి యోగా గురువు జి రఘు ముఖ్య అతిథిగా హాజరై యోగ ప్రాముఖ్యతను, ఆరోగ్య ప్రయోజ నాలను వివ రించారు. బాల్యం నుండే యోగ అలవర్చు కోవ డం వల్ల మేధాశక్తి పెరుగుతుందని, దృఢమైన ఆరోగ్యాన్ని పొందవచ్చు అని తెలి పారు. వయసు పైబడిన వారు, వృద్ధులు యోగా అనుసరించడం వలన ఉచ్వాస పిచ్వాస ల ద్వారా ఊపిరితిత్తుల పనితీరు, గుండె ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడతాయని తెలిపారు. యోగా ను ప్రతి ఉదయం ఒక ప్రక్రియగా భావించి చేయడం వలన ఆరోగ్యం, ఆయుషు పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం జయరాజ్, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహించిన సందర్భంగా టీవీఆర్ (గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సూరా రవి చంద్ర రెడ్డి, దీప్తి రెడ్డి లు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


# ధాన్యరాశుల ఖిల్లా.. జగిత్యాల జిల్లా..!

### సిరుల మాగాణి... వ్యవసాయ ఘని





**జగిత్యాల ప్రతినిధి, జూన్20 (సింగిడి):** జిల్లా మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే వ్యవసాయాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణలోని వ్యవసాయ జిల్లాల్లో జగిత్యాల ఒకటి. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో విస్తరించిన ఈ జిల్లా ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పసుపు, మామిడి మరియు కంది వంటి పంటల సాగుకు ప్రసిద్ధి చెందింది. జిల్లాలోని రైతులు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం నిరంతరం చర్యలు చేపడుతోంది. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో గత రబీ లో యూరియా కోసం రైతుల అవస్టలు గుర్తించి, రాష్ట్రం లో మొట్ట మొదటి సారిగా కలెక్టర్ గారి ఆదేశం సారం కీళ్ల వ్యాసాయ షాక్ ద్వారా యూరియా సరఫరాని క్రమ బద్ధికరించడానికి డీలర్ ల వద్దనే ఒక అప్ప్ ఉపయోగించి యూరియా సరఫరా చేయడం జరిగినది, తర్వాత తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్ నుంచే యూరియా ఎరువులను బుక్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం జగిత్యాల జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. రైతులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పూర్తి అవగాహనా కల్పించారు గతంలో ఎరువుల కోసం రైతులు విక్రయ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కొన్ని సార్లు ఎరువుల కొరత ఉందనే అపోహలతో పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడేది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు యూరియా బుకింగ్ యాప్ ద్వారా ముందుగానే బుకింగ్ చేసుకునే అవకాశం ఉండటంతో రైతులకు ఎంతో సౌలభ్యం కలిగింది. జిల్లాలో ఇప్పటివరకు 18,958 మంది రైతులు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను వినియో గించారు. వీరు మొత్తం 58,241 యూరియా బస్తాలను బుక్ చేసుకున్నారు. అందులో 41,315 యూరియా బస్తాలను విజయవంతంగా కొనుగోలు చేశారు. ఈ గణాంకాలు యాప్‌పై రైతులకు ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. యాప్ ద్వారా బుకింగ్ చేసిన రైతులకు కేటాయించిన విక్రయ కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో రైతులు అనవసరంగా తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రత్యేక విధానం పూర్తిగా పారదర్శకంగా ఉండటం విశేషం. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ యాప్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ సేవలపై రైతుల్లో చైతన్యం పెంచుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 90,8 98 యూరియా బస్తాల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రైతుల అవసరాలకు అనుగుణంగా నిరంతర సరఫరా కొనసాగుతోంది. ఎరువుల కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన అవసరం లేదని రైతులకు కావాల్సిన ఎరువులు అందుబా టులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వరి సాగు ఎక్కువగా ఉండే జగిత్యాల జిల్లాలో యూరియా అవసరం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు పంటల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. పంటలలో వచ్చే తెగుళ్ల నివారణకు తగిన సూచనలు అందిస్తోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. వ్యవసాయరంగంలో సాంకేతికత వినియోగం వల్ల రైతులకు సమయం ఆదా కావడంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. మొబైల్ యాప్ ద్వారా ప్రభుత్వ సేవలు నేరుగా రైతుల చేతుల్లోకి చేరుతున్నాయి. ఇదే డిజిటల్ తెలంగాణ లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా రైతులు కూడా ఈ మార్పును స్వాగతిస్తున్నారు. మొబైల్ ఫోన్ ద్వారా సులభంగా యూరియా బుక్ చేసుకోవడం, ఎప్పుడు ఎక్కడ యూరియా లభిస్తుందో తెలుసుకోవడం, విక్రయ కేంద్రాల్లో రద్దీ తగ్గడం వంటి ప్రయోజనాలు పొందుతున్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా వ్యవసాయ వ్యవస్థను ఆధునీకరించే దిశగా అడుగులు వేస్తోంది. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రత్యేక సేవలను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ వ్యవసాయ విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయి. రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయి. వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి. జిల్లాలోని రైతులు ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని, యాప్ ద్వారా ఎరువులు పొందడం సులభమైందని చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి జగిత్యాల జిల్లా ఒక విజయవంతమైన ఆదర్శంగా నిలుస్తోంది. రైతు పక్షపాత పాలన, సమర్థవంతమైన పరిపాలన, ఆధునిక సాంకేతికత సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని జగిత్యాల జిల్లా నిరూపిస్తోంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయి. అందులో భాగంగా జగిత్యాల జిల్లా సాధిస్తున్న పురోగతి రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది.



## ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలకు బడి పంతుళ్ళ ఇక్కట్లు



**కొడంగల్, జూన్ 20(సింగిడి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యా ర్థుల సంఖ్య పెంచుకోవడం సర్కారు బడి పంతుళ్ళకు సంకటంగా మారింది. దీనికి కారణం ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడమే అనడంలో ఏకొంచం సందేహం అవసరం లేదు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు సమీప గ్రామాలు తిరుగుతూ, ఇంటింటికి వెళ్లి తమపాఠశాల కు పిల్లలను పంపండి అని అడగడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టుకోవాలని, విద్యార్థుల సంఖ్య ను పెంచు కోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. బొంరాస్ పేట్ మండలంలోని నాందార్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రవేశించేందుకు పంతుళ్ళు గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని తట్టారు. బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అదనంగా సమీపంలో గల తాండలకు వెళ్ళి ఇంటింటికి తిరుగుతూ ,తాండలో ఐదవ తరగతి పూర్తైన విద్యార్థులు తమ పాఠశాల లో ఆరు, ఏడు తరగుతుల్లో ప్రవేశించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. శనివారం పాలబావి తాండకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల వరకు తాండలో ఇంటికి తిరిగారు. పాఠశాల బలోపేతానికి తమవంతు కృషిచేస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామయ్య తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపించి, పాఠశాల బలోపేతానికి తోడ్పడాలని, పాఠశాలలు నిలబెట్టుకోవడం ఉపాధ్యాయులతోపాటు గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల పైన కూడా బాధ్యత ఉన్నట్లు పేర్కొన్నారు.

# పచ్చదనమే భావితరాలకు వరం

### జిల్లాలో ఘనంగా ప్రారంభమైన వన మహోత్సవం కార్యక్రమం, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు





**నాగర్‌కర్నూల్ జూన్20 (సింగిడి) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పట్టణం లోని ఇందిరా మహిళ శక్తి భవన సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో మన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కలను నాటిన రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌క ర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, నాగర్ కర్నూల్ శాసనస భ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, మొక్క లు నాటారు. జిల్లా అటవీశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఈ సంద ర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పెరుగు తున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలను ఎదుర్కో వాలంటే విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టడం అత్యంత అవసరమని అన్నారు. మొక్కలు మన జీవి తానికి ఆధారం అని, అవి ఆక్సిజన్‌ను అందించ డంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడ టంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపా రు. మొక్కలు నాటడం ఒక మంచి కార్యక్రమమే అయినప్పటికీ, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచిన ప్పుడే ఆ కార్యక్రమానికి నిజమైన ఫలితం దక్కుతుం దని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని తన కుటుంబ సభ్యుడిలా సంరక్షించాలని సూచించారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. ప్రకృతి సంపదను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు పూర్తిసహకారం అందించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో పచ్చదనం పెంపు కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నా మని తెలిపారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు గ్రామాలు, పట్టణాల సౌందర్యం కూడా పెరుగుతుందని తెలి పారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లా డుతూ, నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం మన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 35లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన మొక్క ల లక్ష్యాలను చేరుకోవాలని పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు, జిల్లాలో వృక్షారోపణ లక్ష్యా లను విజ యవం తంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేస్తున్నాయని తెలిపారు. నాటిన ప్రతిమొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వనమ హోత్సవపు కార్యక్ర మం పోస్టర్ ఆవిష్కరించారు. కార్య క్రమంలో నాగర్ కర్నూల్ మున్సి పల్ చైర్మన్ తీగల సురేంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం

### రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి

**ఎల్బీనగర్, జూన్20 (సింగిడి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్య తిరేక విధానాలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని రాష్ట్ర యువ జన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని గణేష్ ఫంక్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఖాలీద్ తో కలిసి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి




శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అలాగే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ సూచనలు, భారతీయ యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయభాను చిబ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రజాసమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమా లను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని, టికెట్ల కేటాయింపులో కూడా యువజన కాంగ్రెస్ కు ప్రాధాన్యం లభిస్తుందని, కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతిఒ క్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహ ఇంచార్జ్ కె.ఆర్. భవ్య, రంగారెడ్డి జిల్లా యువ జన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచం ద్రారెడ్డి, శ్యామ్ చరణ్ రెడ్డి, సాగర్, విద్యారెడ్డి, పాలడుగు నాగార్జున, శివకుమార్, సుభాన్ యాదవ్, దళపతి తదితరులు పాల్గొన్నారు.

## భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, జూన్ 20 (సింగిడి):** వచ్చే నెలలో చేపట్టనున్న భూముల సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లతో భూ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 70 గ్రామాల్లో భూముల సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూ సమస్యలు, వివాదాలకు తావులేకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. డీజీపీఎస్, రూవర్స్ జీఐఎస్, క్యూ జీఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక విధానాలను వినియోగించనున్నట్లు తెలిపారు. సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వం భూధార్ కార్డులను జారీ చేయనున్న నేపథ్యంలో ఎలాంటి తప్పిదాలు లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి వినయ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 21-6-2026

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**హ్యాం రోడ్ల నిర్మాణ పైలాన్ పనుల పరిశీలన**

**నల్లగొండ ప్రతినిధి, జూన్ 20 (సింగిడి):** నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. మాట్లాడుతూ 13500 కోట్లకు సంబంధించిన పైలాన్ ఎప్పుడు గుర్తుండిపోయేలా నిర్మించాలని, ముఖ్యంగా పైలాన్ చుట్టూ కిందిభాగాన మూడు రంగుల కలర్ వేయించాలని, అలాగే పెద్ద అక్షరాలతో రోడ్లు, భవనాల శాఖ పేరు అగుపించేలా రాయించాలని, రెయిలింగ్‌తో పాటు, పైలాన్ చుట్టూ అందంగా తీర్చిదిద్దాలని, సాయంత్రం సమయంలో గ్రామస్తులు, ప్రజలు పైలాన్ వద్ద గడిపే విధంగా పచ్చ గడ్డితో తీర్చిదిద్దాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట కనగల్ మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలు, ఏర్పాటు చేయాల్సిన కుర్చీలు, టెంట్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు, పార్కింగ్ ఇతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్‌తో చర్చించారు. వారి వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



## అన్నదాతల సమస్యలపై పోరాడుతాం



**నూతనకల్, జూన్ 20 (సింగిడి):** రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం పూర్తిగా మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రతి పంటలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయమని చెప్పడం ద్వారా రైతులు తీవ్ర నిరాశకు గురి చేస్తుందన్నారు. ఓవైపు పంటలు పండించాలని చెబుతూ, మరోవైపు పంట కొనుగోళ్లకు నిరాకరించడం రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నదన్నారు. యూరియా కొనుగోళ్లలో అమలవు తున్న యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు మల్లికార్జున్, లింగరాజు, పిఏసిఎస్ మాజీ చైర్మన్ వెంకన్న, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, విజయ్ కుమార్, మొగుళ్ల వెంకన్న, మధు, సైదులు, వెంకటరెడ్డి, కరుణాకర్ రెడ్డి, గణేష్, చిరంజీవి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## నిరంజన్‌కు బండ్ల గణేష్ ఆర్థికసాయం





**హనుమకొండ, జూన్ 20 (సింగిడి):** జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న పానుగోటి నిరంజన్ 17 న సినీ నటుడు ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గత బుధవారం పరామర్శించిన విషయం తెలిసిందే. అయితే పవన్ కళ్యాణ్ వీరాభిమాని సినీ నటులు, నిర్మాత బండ్ల గణేష్ శనివారం నిరంజన్ ఇంటికి వచ్చి అతన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ తనకు దైవ సమానమైన పవన్ కళ్యాణ్ నిరంజన్ ఇంటికి వచ్చి పరామర్శించిన విషయం తెలిసిందని, అందులో భాగంగానే నిరంజన్ ను పరామర్శించేందుకు వచ్చానన్నారు. ముఖ్యంగా తన కూతురి వివాహ వేడుకల్లో బిజీగా ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ పరామర్శించిన వ్యక్తిని చూడాలని పరామర్శించాలని సంకల్పంతో వచ్చానన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదినాన్ని పురస్కరించుకొని నిరంజన్ కు తన స్వంత బ్యానరైన పరమేశ్వర ఆర్ట్స్ బ్యానర్ తరపున రూ 5లక్షల ఆర్థిక సహాయాన్ని నిరంజన్ తండ్రి పానుగోటి రాంగోపాల్ కు అందించానన్నారు. రూ 5 లక్షలతో ఏం చేస్తావని నిరంజన్ ప్రశ్నిస్తే కారులో తిరగాలని ఉందని కోరిక కోరాడని నిరంజన్ కోరికను తల్లిదండ్రులు తప్పక తీర్చాలని ఆయన సూచించారు. నాలాంటి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి నిరంజన్ ను ఆదుకోవాలని బండ్ల గణేష్ ఆకాంక్షించారు.

## మహాసభలకు తరలిన వ్యవసాయ కార్మికులు



**అమరచింత, జూన్ 20 (సింగిడి):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలకు ఉమ్మడి అమరచింత ఆత్మకూరు మండలాల నుండి వ్యవసాయ కార్మికులు శనివారం భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్, నాయకులు మహమూద్, రాజు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఈ మహాసభలో మహానేతలు ఎండగడతారని అన్నారు. మహాసభలకు వనపర్తి జిల్లా వ్యాప్తంగా వివిధ వాహనాల్లో కార్మికులు భారీగా తరలి వెళుతున్నారన్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

**కాజిపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి**



**కమలాపూర్, జూన్ 20 (సింగిడి):** ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రశాంతంగా స్వచ్ఛ వాతావరణంలో జీవించాలని కాజిపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం కమలాపూర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం నిర్వహిస్తున్న వారంలో ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ గ్రామస్తులతో కలిసి శ్రమదానం లో పాల్గొని రోడ్లను మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీని పారిశుద్ధ నిర్వహణలో జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో గొప్ప పేరు తీసుకొచ్చే విధంగా సర్పంచ్ పబ్బు సతీష్, గ్రామపంచాయతీ పాలకవర్గం తీసుకున్న గొప్ప నిర్ణయమని అన్నారు. ఊరి కోసం వారంలో ఒక్కరోజు శ్రమదాన కార్యక్రమం ప్రారంభంలో కొద్దిమంది పాలకవర్గం సభ్యులతో మొదలై క్రమేణా ఇందులో పాల్గొనే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పాలక వర్గాన్ని అభినందించారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ బయట పారవేయొద్దన్నారు. డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయొద్దని దానివల్ల పరిసరాలు కలుషితమై మీకే వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలకు ఒక మంచి వాతావరణాన్ని మనం అందించాలని, నాగరికత తెలిసిన మనుషులుగా వ్యవహరిస్తూ పరిసరాలను కలుషితం చేసుకోకుండా పరిశుభ్రంగా ఉంచుకొని ప్రశాంతమైన, స్వచ్ఛమైన వాతావరణంలో ప్రజలందరూ జీవించాలని అన్నారు. ఇది సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గం, కొంతమంది సభ్యులు బాధ్యత తీసుకొని చేస్తే కమలాపూర్ స్వచ్ఛ కమలాపూర్ గా ఎట్టి పరిస్థితుల్లో మారదని ప్రజలంతా కలిసికట్టుగా బాధ్యత తీసుకొని ఎవరి పరిసరాలను వారు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తమ ఊరి బాగు కోసం తాము బాధ్యత తీసుకుంటామని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని వాగ్దానం చేసుకొని ఎవరికి వారుగా ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. మన ఇంట్లోని చెత్తాచెదారాన్ని బయట పారవేయకుండా మన ఇంటి వద్దే ఉంచుకొని గ్రామ పంచాయతీకి సంబంధించిన వాహనాలు వచ్చినప్పుడు ఆ వాహనాలలో పారబోయాలని అన్నారు. ఇతర మండలాల నుంచి జిల్లాల నుంచి కమలాపూర్ కి వచ్చి కమలాపూర్ గ్రామాన్ని స్వచ్ఛ కమలాపూర్ గా ఎలా మార్చారు అని మన దగ్గరికి వచ్చి వారంతా తెలుసుకొని పోవాలని ఆ విధమైన ఆదర్శ గ్రామంగా మన గ్రామం తయారు కావాలన్నారు. ఇది ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదని ప్రజలంతా ఐకమత్యంగా బాధ్యతతో వ్యవహరిస్తే ఇది తప్పకుండా సాధ్యమవుతుందని అన్నారు. ఈ సృష్టిలో మనిషి గట్టి సంకల్పంతో ముందడుగు వేస్తే సాధ్యం కానిది అంటూ సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని ఆయన అన్నారు. పారిశుద్ధ కార్మికుల శ్రమను ప్రతి ఒక్కరు గుర్తించాలని వారు చేస్తున్న పనిని గౌరవించాలని వారికి ప్రజలందరూ సహకరించాలన్నారు. వారు లేకపోతే ఊరు పరిశుభ్రంగా ఉండదని పారిశుద్ధ కార్మికుల వల్లనే చాలావరకు పరిసరాలు, డ్రైనేజీ కాలువలు పరిశుభ్రంగా ఉంటున్నాయని ప్రజలకు వివరిస్తూ, పారిశుద్ధ కార్మికులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సి ఐ పి నవీన్, ఎస్సై దిలీప్, సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఆర్య వైశ్యులు, పారిశుద్ధ్య కార్మికులు, యూత్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు

**కాటారం డిఎస్పి సూర్యనారాయణ**



**మహదేవపూర్, జూన్ 20 (సింగిడి):**
చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జయశంకర్ భూపాలపల్లి కాటారం డిఎస్పి సూర్యనారాయణ అన్నారు. జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు శనివారం పలిమెల మండల కేంద్రంలో డి. ఎస్. పి పర్యవేక్షణలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి తనిఖీలు నిర్వహించి 5 లీటర్ల గుడుంబా, నెంబర్ ప్లేట్లు లేని 5వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా డి. ఎస్. పిసందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుడుంబా వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబంలో కలహాలు ఏర్పడతాయని, అక్రమ కార్యకలాపాలకు పాలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొల్పడం కోసమే ఇలాంటి కార్డెన్సర్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలిమెల, మహాదేవపూర్, కాళేశ్వరం ఎస్సైలు సాయి శశాంక్, సాంబమూర్తి, తమాషా రెడ్డి తో పాటు పలువురు పోలీసులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



**అమరచింత, జూన్ 20 (సింగిడి):** అమరచింత మండలంలోని నాగల్ కడుమూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు శనివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని జడ్పీ హెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పి హెచ్ఎస్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేశారు. సందర్భంగా కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థిని విద్యార్థులు ఈ పాఠశాలలో చేరాలని కోరారు. అన్ని వసతులు గల ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థుల జీవితం ఉన్నత స్థానానికి వెళుతుందని తల్లిదండ్రులు విషయాన్ని గమనించి ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లల్ని పంపించాలని కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు ఆయన ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, హెచ్ఎంలు మౌలానా, ప్రవీణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మెప్మా నిధుల దుర్వినియోగంపై చర్యలు

**కోదాడ, జూన్ 20(సింగిడి):** కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని స్వయం సహాయక సంఘాలు, స్లమ్ లెవెల్ ఫెడరేషన్లలో ఆర్థిక అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై నిర్వహించిన విచారణలో అవకతవకలు జరిగినట్లు తేలిందని మెప్మా అధికారులు తెలిపారు. సనా, దుర్గాభవాని స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన రుణ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి, నిధుల రికవరీ చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. అలాగే సూర్యాపేటలోని కాశింపేట, రాంకోటి తండా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు రిసోర్స్ పర్సన్లను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రజా ధనం, సంఘాల నిధుల వినియోగంలో పారదర్శకతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు.



# రైతులను మోసం చేస్తూ ప్రభుత్వం కాలం గడుపుతోంది

**మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి**



**ఆలేరు, జూన్ 20(సింగిడి):** ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆలేరు పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రభుత్వంలోకి రాకముందు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని సునీత ఆరోపించారు. గతంలో 33 రకాల సన్న రకాల ధాన్యాలను కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 7 రకాలనే కొనుగోలు చేస్తామని చెప్పడం రైతుల ప్రయోజనాలను దెబ్బతీయడమేనని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ హామీల విషయంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అర్హులైన రైతుల్లో కేవలం కొంతమందికే రుణమాఫీ జరిగిందని విమర్శించారు. రెండు పంటలకు రైతు భరోసా అందించాల్సి ఉండగా పరిమిత ఎకరాలకే నిధులు విడుదల చేసి అందరికీ ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తోందని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ముందస్తు ప్రణాళికతో యూరియా ను బఫర్ స్టాక్ ఏర్పాటు చేసి రైతులకు కొరత రాకుండా చర్యలు తీసుకునేవారని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం ఎంత కొంటే అంతే కొనుగోలు చేస్తామని చెప్పడం సరైన విధానం కాదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, రైతు బంధు, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు వేదికలు, వ్యవసాయ విస్తరణ అధికారుల నియామకం వంటి కార్యక్రమాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యవసాయ రంగంపై స్పష్టమైన ప్రణాళిక, ముందుచూపు లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కలెక్టర్ ను డిమాండ్ చేశారు.

# వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి**



**మిర్యాలగూడ, జూన్ 20 (సింగిడి):** వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అనే మాజీ శాసనసభ్యులు తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మిర్యాలగూడ రెడ్డికాలనిలో గల బి ఆర్ ఎస్ కార్యాలయం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూదేశానికి వెన్నుముకగా నిలిచిన తెలంగాణ రైతులకు దారుణంగా వెన్నుపోటు పొడిచింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం , వ్యవసాయాన్ని ఇప్పటికే సంక్షోబంలోకి నెట్టి రైతు బతుకును చిద్రం చేశారు. రైతులకు లాభమైన పంటలనే వేయాలని ప్రోత్సహించాలి కానీ కేవలం ఏడు రకాల వరి వంగడాలనే సాగు చేయమనటం ఎంతవరకు సబబు అని వారు విమర్శించారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతుల ఖాతాల్లో నేరుగా 11 విడతల్లో 72,000 కోట్లు జమ చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారు రైతు కుటుంబానికి ఏమైనా జరిగితే రోడ్డున పడకూడదని ఐదు లక్షల రైతు బీమాను అమలు చేశారు రైతుబంధుకు 72,000 కోట్లే కాకుండా రైతు రుణమాఫీకి 29 వేల కోట్లు రైతు బీమాకు 6800 కోట్లు చెల్లించారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఇలా పదేళ్లపాటు పండుగల మారిన వ్యవసాయాన్ని మళ్లీ దండుగలా మార్చే కుట్ర చేస్తున్నాడు ఈ ముఖ్యమంత్రి రైతుబంధులు 15 వేలకు పెంచుతానని చివరికి మూడుసార్లు ఎగ్గొట్టి మోసం చేశాడు 24 గంటలు ఉచిత విద్యుత్కు ఉరివేయడానికి రైతు డిస్కౌంట్ తెరపైకి తెచ్చాడు చివరికి రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆత్మహత్య చేసుకునే దుస్థితి తెచ్చాడు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రంగారెడ్డి, మోషన్ అలీ, కరుణాకర్ రెడ్డి, దుర్గంపూడి నారాయణ రెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, పాలుట్ల బాబయ్య, బైరం సంపత్, మట్టపల్లి సైదులు యాదవ్, కుందూరు వీర కోటిరెడ్డి, ఆంగోతు హాతిరాం నాయక్, చిర్రా మల్లయ్య యాదవ్, మిర్యాల మధుసూదన్ రావు, జరిపోతుల రాములు గౌడ్, ఎండి ఇలియాస్ ఖాన్, తీరంశెట్టి కోటేశ్వరరావు, పెండ్యాల పద్మ, కోదాటి రమ, ధనావతు దస్రు నాయక్, పున్నా నాయక్, కంపసాటి మధుసూదన్, పేరాల కృపాకర్ రావు, అమరావతి సైదులు, పోలు నాగార్జున తదితరులు ఉన్నారు.

## డిజిటల్ విద్యతో సాంకేతిక రంగంలో అవకాశాలు



**కోదాడ, జూన్ 21(సింగిడి):** డిజిటల్ లిటరసీ, ఏఐ కోర్సు ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో సాంకేతిక రంగంలో మెరుగైన అవకాశాలు పొందగలరని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కోదాడ ఈఎంసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన డిజిటల్ లిటరసీ, ఏఐ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, కంప్యూటర్ పరిజ్ఞానం, ఏఐ, చాట్‌జీపీటీ, కోడింగ్ వంటి అంశాలపై వారి అవగాహనను పరిశీలించారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పాఠశాలలో నూతన అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంఈవో సలీం షరీఫ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, శిక్షకులు ధీరజ్, రవితేజ, నాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కోదాడ, జూన్ 21(సింగిడి):** కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం కోదాడలో మంత్రి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. దేశ సేవలో సైనికుడిగా, ప్రజాసేవలో నాయకుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో అల్తాఫ్ హుస్సేన్, బండల్ కోటిరెడ్డి, పాశం శ్రీను, తోట జ్యోతి నాగేంద్రమ్మ, నేహా నాజ్, ఉప్పుగల శ్రీనివాస్, ఫయాజ్, రావెళ్ల కృష్ణారావు, మైలార్శెట్టి భాస్కర్, ఒంటిపులి శ్రీనివాస్, లైటింగ్ ప్రసాద్, వేమూరి సతీష్, చందు నాగేశ్వరరావు, నెమ్మది దేవమణి, ప్రకాష్ బాబు, మాతంగి శైలజ, కెజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు



**పాలకవీడు, జూన్ 20(సింగిడి):** రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జానపహాడ్ దర్గాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ నరసింహారావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నీమా నాయక్, సర్పంచులు కవిత కిరణ్, సురేష్, లక్ష్మీ సైదా, సునీత లక్ష్మణ్, మంగమ్మ సోమ్లా నాయక్, అందే సుధారాణి రాజు, యాతం శ్రీను, కొత్తపల్లి సుశీల ఏసు, వరలక్ష్మి రామానుజ రెడ్డి, నాగరాజు, బుడిగ సైదులు, జ్యోతి, సందీప్, పిడమర్తి ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, శోభన్, రాము పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**హనుమకొండ, జూన్ 20, (సింగిడి):**
ఎస్సీ ఎస్టీ ఫిర్యాదులపై అధికారులు సత్వర చర్యలు చేపట్టి పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్లో శనివారం జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయితో కలసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూసమస్యలు, అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలు, రోస్టర్ విధానం, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విచారణ, భూవివాదాల పరిష్కారంలో చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీ ధార కవిత, జిల్లా ఆదనవు కలెక్టర్ రవి, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో ఉద్రిక్తత

**కేటీకే 5 గని వద్ద కల్వకుంట్ల కవితను అడ్డుకున్న సింగరేణి సెక్యూరిటీ**



**భూపాలపల్లి, జూన్ 20 (సింగిడి):** భూపాలపల్లిలో జరిగిన' బాయి బాట ' కార్యక్రమానికి విచ్చేసిన టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కేటీకే 5 గని వద్ద మైన్ లోకి వెళ్లకుండా సింగరేణి సెక్యూరిటీ గార్డ్ అడ్డుకున్నారు. సెక్యూరిటీ టిఆర్ఎస్ కార్యకర్తల మధ్య జరిగిన తోపులాటలో గేటు తీసివేసి కవిత మైన్ లోపలికి వెళ్లారు. అంతకుముందు కవిత భూపాలపల్లికి రాగానే అంబేద్కర్ జంక్షన్ వద్ద టిఆర్ఎస్ నాయకులు హెచ్ఎంఎస్ కార్మికులు, ఘన స్వాగతం పలికారు. కేటీకే 5 ఇంక్లైన్ కు చేరుకున్న కవిత గని లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. అనంతరం మైన్ గేటు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న నాయకులు, గేట్లో తీసివేయడం తో మైన్ లోపలికి ప్రవేశించారు.

## మండలంలో 20 వేలకు పైగా యూరియా నిల్వలు



**కమలాపూర్, జూన్ 20 (సింగిడి):** మండలంలోని రైతులకు అందుబాటులో 20 వేలకు పైగా యూరియా నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు యూరియా బస్తాలు బుకింగ్ ఆప్ ద్వారా బుక్ చేసుకొని కోనుగోలు చేయాలని సూచించారు. రైతులు ఫర్టిలైజర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఫోన్ నెంబర్ మరియు ఓటీపీ ధర లాగిన్ అయిన తర్వాత విస్తీర్ణము, పంటను సెలెక్ట్ చేసుకున్న తర్వాత మండలంలోని మీకు సమీపంలో ఉన్న ఫర్టిలైజర్ షాపును, ఎంపిక చేసుకొని, యూరియా బస్తాలను బుక్ చేసుకోవాలన్నారు. ఈ విధంగా బుక్ చేసుకున్నటువంటి బస్తాలను 48 గంటల వరకు తీసుకోవడానికి సమయం ఉంటుందన్నారు. ఆలోపు బస్తాలను కోనుగోలు చేసుకోవాలని తెలిపారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 21-6-2026

# ఓటరు జాబితా సవరణపై పరిశీలన



**రామచంద్రపురం, జూన్ 20(సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రపురం మండల పరిధిలోని భారతీనగర్ డివిజన్ హెచ్ఐజీ కమ్యూనిటీ హాల్‌లో అధికారులు నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, పలువురు బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు. ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియపై చర్చించిన అధికారులు, ఏజెంట్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు ఉండకూడదని స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని, అదే సమయంలో డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ఇది పారదర్శకంగా మరియు ఖచ్చితంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు బాధ్యతతో పనిచేసి ఓటరు జాబితాను సక్రమంగా తయారు చేయాలనీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సర్కిల్ మాజీ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆడబిడ్డలకు అండగా ప్రజాపాలన

## ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్




**హైదరాబాద్ ప్రతినిధి, జూన్ 20, (సింగిడి):** రాష్ట్రంలోని ప్రతీ మహిళను ఆర్థికంగా బలపడేలా చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో జరిగిన ఇందిరా మహిళా శక్తి, చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని. మంత్రులు, అధికారులతో కలిసి ఆడ బిడ్డలకు ప్రభుత్వం తరపున చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# కిసాన్ సమ్మాన్ నిధి డబ్బుల జమ

## బిజెపి అధ్యక్షుడు సింగీతం చంద్రకాంత్



**వికారాబాద్, జూన్ 20(సింగిడి):** దేశ రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 23వ విడత ఆర్థిక సహాయాన్ని జూన్ 20 న రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు బిజెపి నవాబుపేట మండల అధ్యక్షుడు సింగీతం చంద్రకాంత్ తెలిపారు. గత పది సంవత్సరాలుగా గడువు లోపల ఎలాంటి ఎగవేతలు, దాటవేతలు లేకుండా, రైతులు ఎదురుచూడకుండానే సకాలంలో వారి ఖాతాలలో డబ్బులు జమ చేసిన ఘనత దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి దక్కిందని పేర్కొన్నారు. 23వ విడత నిధుల విడుదలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు లబ్ధి పొందనున్నారని, రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ వ్యయాలను తగ్గించడం మరియు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది అన్నారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం రైతాంగానికి మరింత భరోసాను కల్పిస్తోందని ఆయన మండల రైతుల పక్షాన ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

# బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణకు వస్తే అడ్డుకుంటాం

## ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్ ప్రతినిధి, మే 20 (సింగిడి):** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడాన్ని నిరసిస్తూ... గాంధీ భవన్ లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్ష లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు ను అవమానించేలా పాకిస్తాన్ తో పోల్చి.... తప్పుగా మాట్లాడిన తేజస్వి సూర్యా... వారి పార్టీ విధానాన్ని చెప్పకనే చెప్పారన్నారు. పార్లమెంట్‌లో ఆనాడు తేజస్వీ సూర్యా మాటలను ఖండించలేని బీజేపీ, నేతలు... ఇప్పుడు తేజస్వి సూర్యా ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నారన్నారు. ఆనాటి మాటలకు క్షమాపణ చెప్పకుండా... నమో జెన్ జీ కాంక్లేవ్ పేరుతో హైదరాబాద్ లో మీటింగ్ పెట్టి, సూర్య హాజరైతే తప్పకుండా అడ్డుకుంటామన్నారు. మీటింగ్ పెట్టాలనుకుంటే ముందు బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఇప్పటి వరకు సూర్య మాటలను, బీజేపీ నేతలుగానీ, బీఆర్ ఎస్ నేతలుగానే ఖండించలేదన్నారు. తమ అస్థిత్వాన్ని, తమ సెంటిమెంట్ ను ఎగతాళి చేసి మాట్లాడిన సూర్య తెలంగాణకు వస్తే.... ఆవేశంతో ఉన్న యువకుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను ఎవరు దెబ్బతీసిన ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ అంటేనే భావోద్వేగం, సెంటిమెంట్, అలాంటి సెంటిమెంట్ ను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరి కాదన్నారు. దేశంలో పేపర్ లీకులు చేసి, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీజేపీ, తెలంగాణలో జెన్ జీ యూత్ తో సదస్సులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ కుట్రలకు బలవుతున్న జెన్ జీ యువతనే బీజేపీ పాలకులపై పోరాటం చేస్తోందన్నారు. అలాంటి బీజేపీకి ఎలాంటి సమాధానం చెప్పాలో జెన్‌జీ యువతకు బాగా తెలుసన్నారు. ఇప్పటికే పోరాటాన్ని ఉధృతం చేశారనీ, మోడీ ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రజల చేతుల్లో శిక్ష అనుభవించక తప్పదన్నారు.




# అంబేద్కర్ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

## బొప్పాపూర్ గ్రామానికి దక్కిన అరుదైన గౌరవం సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్‌రావు



**దుబ్బాక, జూన్ 20 (సింగిడి):** అక్బర్‌పేట-భూంపల్లి బొప్పాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు, ప్రజాగాయకుడు, గానకోకిలబండమీది మల్లయ్యకు ప్రతిష్ఠాత్మక జాతీయ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అవార్డు లభించడం పట్ల గ్రామ ప్రజలు హర్ష వ్యక్తం చేశారు. సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బండమీది మల్లయ్యతో పాటు ఆయన సతీమణి బాలమణిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్‌రావు మాట్లాడుతూ, బండమీది మల్లయ్య సాధించిన ఈ జాతీయ స్థాయి గౌరవం బొప్పాపూర్ గ్రామ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుం దని అన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి, తన కళా ప్రతిభతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం గ్రామ ప్రజలందరికీ గర్వకారణ మని పేర్కొన్నారు. దశాబ్దాలుగా జానపద కళారంగంలో విశిష్ట సేవ లందిస్తూ, తన పాటల ద్వారా సామాజిక చైతన్యం, విద్యా ప్రాధాన్యత, సమానత్వ భావనలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న మల్లయ్యకు ఈ అవార్డు రావడం ఎంతో సముచితమని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను, సామాజిక న్యాయం, సమాన హక్కులు, విద్యా చైతన్య సందేశాలను తన గీతాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చేరవేయడంలో మల్లయ్య విశేష కృషి చేశారని అన్నారు. ఆయన జీవితం యువతకు ఆదర్శమని, పట్టుదలతో కృషి చేస్తే గ్రామీణ ప్రాంతాల నుంచే జాతీయ స్థాయి గుర్తింపు సాధించవచ్చని నిరూపించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయనకు మరిన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలు లభించాలని ఆకాంక్షిం చారు. అవార్డు గ్రహీత బండమీది మల్లయ్య మాట్లాడుతూ, తనకు లభించిన ఈ గౌరవం వ్యక్తిగతంగా తనకే కాకుండా బొప్పాపూర్ గ్రామ ప్రజలందరికీ దక్కిన గుర్తింపు అని అన్నారు. తాను సాధించిన ప్రతి విజయానికి గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు, సహకారం, ఆశీర్వాదాలే కారణమని తెలిపారు. గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, అభిమానులు తనను ఘనంగా సన్మానించడం జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా నిలుస్తుందని భావో ద్వేగంతో పేర్కొన్నారు. తాను కళాకారుడిగా సమాజంలోని బడుగు, బలహీన వర్గాల సమస్యలను, అంబేద్కర్ ఆలోచనలను, విద్యా ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కళ ద్వారా సమాజ మార్పు సాధ్యమనే నమ్మకంతో ముం దుకు సాగుతున్నానని, భవిష్యత్తులో కూడా ప్రజా చైతన్య కార్యక్ర మాల్లో చురుకుగా పాల్గొంటానని చెప్పారు. ఈ సందర్భంగా తనకు మద్దతుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలం దరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ సన్మాన కార్యక్ర మం విజయవంతం కావడానికి విశేషంగా కృషి చేసిన గవ్వల సుధాకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గ్రామ ప్రజలు, యువజన సంఘాలు, పెద్దలు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరిగె కృష్ణ, మాధవనేని కమలాకర్‌రావు, రావుల వెంకటేష్ గౌడ్, రావుల రాజేందర్ గౌడ్, మిడిదొడ్డి నరసింహులు తదితరులు పాల్గొని బండమీది మల్లయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఏకమై ఒక కళాకారుడిని గౌరవించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ స్థాయిలో బొప్పాపూర్ గ్రామానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన బండమీది మల్లయ్యకు గ్రామ ప్రజలు ఘనంగా అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ రాష్ట్రానికి, సిద్దిపేట జిల్లాకు, బొప్పాపూర్ గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్



**వికారాబాద్, (సింగిడి):** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎల్లకొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలను గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు బాలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ ముఖ్య అతిథిగా.. గ్రామ ఉప సర్పంచ్ చంద్రయ్య, మరియు ఏఏపీసీ చైర్మన్ శ్రీమతి ఈశ్వరమ్మ, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండల్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పిల్లలకు మంచి చదువును అందించడంతోపాటు వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు రాత పుస్తకాలతో పాటు రెండు జతల బట్టలను కూడా ప్రభుత్వం అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోనే మంచి విద్యతోపాటు క్రమశిక్షణ వంటివి పొందే అవకాశం ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడి నిదానం నినాదాన్ని నిజం చేసే విధంగా ప్రతి తల్లిదండ్రి కృషి చేయాలని గుర్తు చేశారు. పాఠశాలలో క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయ బృందం ఉండడం కూడా అదృష్టం అన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో మినీ స్టేడియం ప్రతిపాధన బుట్టదాఖలు



**వికారాబాద్, జూన్ 20 (సింగిడి):** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పరమైన సాధారణ క్రీడా స్థలం మినిస్టేడియం లేదు. గతంలో వికారాబాద్ మున్సిపాలిటీలో పరిధి లోని ధన్నారంలో అప్పటి దివంగత ఎమ్మెల్యే సంజీవరావు స్థల పరిశీలన చేసినప్పటికి మినిస్టేడియం ప్రతి పాధన బుట్ట దాఖలైయింది. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి పలు జిల్లాల్లో మీనిస్టేడియాల నిర్మాణం కోసం, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిపలు కార్యక్రమాలు ప్రారంభించడం వాటిలో మినిస్టేడియాల విష యం ప్రస్తావనకు ఉండటంతో వికారాబాద్ మినిస్టేడియం విష యం చర్చనియాంశమైంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో కళాశాల, పాఠశాల క్రీడా మైదానాలు తప్ప క్రీడాకారులకు సరైన మినిస్టేడియం లేదని ఈ నేపథ్యంలో నే అప్పటి ఎమ్మెల్యే సంజీవరావు అందుకు సంబం దించిన చర్యలు చేపట్టినప్పటికి అది కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం 36.65కోట్ల రూపాయల నిధులతో వివిధ జిల్లాల్లో మినిస్టేడియం, క్రీడా మౌలిక సదుపాయల కల్పన,14.08 కోట్లతో గచ్చిబౌలిలో, ఎల్బి స్టేడియాల్లో బాలల క్రీడా శిక్షణ కు వివిధ అకాడమి లను ప్రారంభించిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో కూడా మినిస్టేడియం నిర్మాణం అనివార్యామని అందుకు సదవకాశం వికారా బాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్ కీలక పదవుల్లో ఉండటం అనుకూలమైన పరిణామమని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

# శరవేగంగా రాజీవ్ రహదారి విస్తరణ పనులు

**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 20 (సింగిడి):** సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జయగుతున్నాయి. అందులో భాగంగా తూంకుంటలోని భూ నిర్వాసితులకు గతంలోనే నష్ట పర హారం అందించగా, వారు కోరిన విధంగా మూడు నెలల గడువు అనంతరం ఎస్డిసిఎల్ వారు తూంకుంటలో సేకరిం చిన స్థలాన్ని పంచనామ చేసి జూన్ 6వ తేదిన హెచ్ఎండిఎ అధికారులకు అప్పగించారు. శనివారం ఎస్డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్ఎండిఎ అధికారులు అక్కడ ఉన్న నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సర్వేయర్ వినయ్ కుమార్, ఆర్ఐ రాఘవ, హెచ్ఎండిఎ ఎఈ సంపత్ అధికారులు పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి





## ఇళ్ళు లేని లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఎంఎల్ఎ కసిరెడ్డి

**ఆమనగల్లు, జూన్ 20(సింగిడి):** పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని ఇల్లు లేని ప్రతి పేద వారికి ఇల్లు ఇస్తుందని కల్వకుర్తి ఎంఎల్ఎ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు . శనివారం కడ్తాల్ మండల పరిధిలో మైసిగండి గ్రామ పంచాయతీ లో విస్లావత్ తులసి భీంజీ నాయక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమం టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, స్థానిక సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్ స్థానిక నేతలతో కలిసి పూజలో పాల్గొని ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ముఖమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యం లో ఇండ్లు లేని అర్హులైన ప్రతి పేద వారికీ ఇండ్లు మంజూరు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా రంజక పాలన కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందని ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని పెర్కొన్నారు. ఎప్పుడు చేయని విధంగా కల్వకుర్తి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో విద్య, వైద్యం వ్యవసాయం, రోడ్లు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అర్హులైనా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంఎల్ఎ పేర్కొన్నారు. ఇప్పటికి 3500 ఇండ్లు నిర్మాణం చివరి దశకు వచ్చాయని ఈ రెండవ దశలో నియోజకవర్గంకు 2500 ఇండ్లు ఈ నెలాఖరుకు మంజూరు చేస్తామని ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, ఉప సర్పంచ్ హీరాసింగ్ నాయక్ పాక్స్ డైరెక్టర్ వెంకటేష్ వార్డు సభ్యులు చత్రు, వినోద్, బాబులాల్, బన్సీ, రవి రాజు, గ్రామ పెద్దలు స్టాలిన్, కిషన్ నాయక్, తులసిరామ్, శేఖర్ గౌడ్, లక్పతి, నరేందర్, రామచందర్, గురుగిళ్ళ లక్ష్మయ్య, సాయికుమార్, శంకర్, అమర్ సింగ్, మల్లేష్, కృష్ణ, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం

## బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, జూన్ 20 (సింగిడి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి పాలనను గాలికి వదిలేసి పేర్ల మార్పుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వం పాలనా తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరుకే ప్రజా పాలన, కానీ రాష్ట్రంలో ప్రజలను హింసించే పాలనతో రాక్షస పాలన కొనసాగిస్తూ ఉన్నారు. రాష్ట్రంలోని రైతులను కెసిఆర్ కడుపులో పెట్టుకొని చూసుకుంటూ సమయానికి విత్తనా లను, యూరియాను అందించి పండించిన పంటను కొని రాష్ట్ర రైతాంగానికి బంగారు బాటలు వేసింది వీ ఆర్ ఎస్ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు. నేడు రైతులకు సకాలంలో యూరియాను అందించలేక, పండించిన పంటను కొనకుండా రాష్ట్ర రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం హింసిస్తుందని పేర్కొన్నారు. అమలు కానీ హామీలు ఇచ్చిన కాం గ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తూనే ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రజలు తన మాటను నమ్మరని తెలిసి ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుబంధు పేరును రైతు భరోసాగా పేరు మార్చి రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. రెండు లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ పేరుతో రుణమాఫీ చేశామంటూ, తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి చేతులు



దులుపుకుందని ఎద్దేవా చేశారు. సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లి లోనే 100 శాతం రుణమాఫీ చేయలేని, చేతగాని దద్దమ్మ ప్రభుత్వం అని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న అకాల మరణం చెందితే వారి కుటుంబానికి తాను అండగా ఉన్నాను అంటూ బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతు బీమాను ఏర్పాటు చేసి ఎంతోమంది రైతులకు రైతు బీమాను అందించారు. రైతులకు యూరియాతో పాటు రైతు బంధును అందిస్తూ వ్యవసాయాన్ని పండుగగా మార్చి దేశంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి చేసే రాష్ట్రంగా తెలంగాణ అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ దైతే పండించిన పంటను కేంద్రం అనుమతి ఉంటే గాని కొనలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి. లేదంటే రైతుల తరుపున బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# విద్యార్థుల ఆత్మబంధువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

## 438 మంది 10వ తరగతి ప్రతిభావంతులకు సైకిళ్ల పంపిణీ రూ.35 లక్షల సొంత నిధులతో సైకిళ్ల కొనుగోలు





**పటాన్చెరు, జూన్ 20(సింగిడి):** పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థుల కోసం మరో వినూత్న కార్యక్రమాన్ని ఆరంభించారు. పటాన్చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారి 2025 - 2026 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ఫలితాలు సాధిం చిన 438 విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్ల పంపిణీ చేపట్టారు. శనివారం ఉదయం పటా న్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలు, 89 ప్రైవేటు పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 మంది విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు మానసిక వికాస శిక్షణా తరగతులతో పాటు పరీక్షా సామాగ్రి పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. అనంతరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులు సైతం పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి వినూత్నంగా సైకిల్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సైకిళ్ళ కొనుగోలు చేసి అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు పదో తరగతి జీవితం మలుపు తిప్పే కీలక దశ అని శ్రీశ్రీ పేర్కొన్నారు. పదో తరగతిలో సాధించే ఫలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అవుతాయని, లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్ కోసం తమవంతు సహకారం అందిస్తూనే ఉంటామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, విద్యార్థులకు ఆత్మబంధువుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సేవలు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# రాజీమార్గమే రాజమార్గం : జడ్జి నారం అరుణ్ కుమార్

**అమనగల్లు, జూన్ 20(సింగిడి):** ఇద్దరు కొట్టుకుంటే ఒక్కరే గెలుస్తారు.. రాజీ పడితే ఇద్దరు గెలుస్తారు అనే నినాదంతో ఆదివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్ విజయవంతమైంది. పోలీస్ స్టేషన్లలో నమోదై, రాజీకి వీలున్న కేసులను, జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శుక్రవారం ఆమనగల్లు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసులు పరిష్కారం అయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన కేసులు పరిష్కారం అయ్యాయి. లోక్ అదాలత్లో




జడ్జీ నారం అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని చిన్న చిన్న తగాదాలకు కోర్టులను ఆశ్రయించిన వారు లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకుని రాజీ పడి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్లో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అందే కార్ యాదిలాల్, ,గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్ ,క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సర్దార్ నాయక్, మల్లేష్, జగన్ గౌడ్, కొప్పు కృష్ణ, శిరీష్ కుమార్, ప్రభు నాయక్, శ్రీనివాస్, మహేశ్వర్, శ్రీశైలం, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## ప్రేక్షకులను అలరించేలా
# చిత్రాలు ఉండాల్సిందే

మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ'చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.

# పవర్‌ఫుల్ రోల్‌లో సమంత

### లేడీ ఓరియంటెడ్ మూవీ.. మాఇంటి బంగారం

మూడేళ్ల విరామం తర్వాత సమంత చేసిన సినిమా 'మా ఇంటి బంగారం'. దాంతో ఈ సినిమాపై అంచనాలు మొదట్నుంచీ భారీగానే ఉన్నాయి. పైగా 'ఓ బేబీ' తర్వాత నందినీరెడ్డి, సమంత కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినిమాపై ఆసక్తి జనాల్లో మెండుగానే ఉన్నది. ఈ సినిమాలో సమంత తొలిసారి యాక్షన్ రోల్ పోషించారు. ప్రచార చిత్రాలకూ, పాటలకు కూడా మంచి స్పందన రావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ వివాహం చేసుకొని, ఓ సంప్రదాయ కుటుంబంలోకి పెద్ద కోడలుగా ఎంట్రీ ఇస్తుంది స్వర్ణ(సమంత). ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి అప్పటికే ఇంట్లో ఉన్న చిన్నకోడలు అనసూయ (శ్రీముఖి)తో పోలుస్తూ అంతా ఆమెను చూస్తుంటారు. అనసూయ ఇంటిని చక్కదిద్దటంలో దిట్ట. కానీ స్వర్ణకు మాత్రం ఆ ఇంటి విషయాలు ఏమీ తెలియవు. కానీ ఎలాగైనా పెద్ద కోడలుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెడుతుంది.



సమంతను కుటుంబ స్త్రీగా చూపించిన తీరు, అక్కడ్నుంచీ నిదానంగా ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్.. సమంతతో చేయించిన పోరాటాలు, ఈ నేపథ్యంలో వచ్చే ఉత్కంఠభరితమైన సన్నివేశాలు మాస్ ఆడియన్స్‌కి బాగా పట్టేస్తాయి. ఇక సెకండాఫ్‌లో కథ కాస్త స్లో అయినట్టు అనిపిస్తుంది. తనెవరో తన ఇంట్లో అందరికీ రివీల్ చేసే క్రమంలో కాస్త కథ నిదానించిన ఫీలింగ్ కలుగుతుంది. హీరోలకు ఏ మాత్రం తీసిపోకుండా అద్భుతమైన పోరాటలు చేసి శభాష్ అనిపించుకున్నది సమంత. ఈ సినిమాలో ఝాన్సీగా, స్వర్ణగా రెండు షేడ్స్‌ని అద్భుతంగా పోషించింది.

## ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ



చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.

## ఫోక్ సింగర్ నాగదుర్గకు
# హీరోయిన్ ఛాన్స్

'కాపోల్ల ఇంటికాడా', 'పేరుగల్ల పెద్దిరెడ్డి', 'దారి పొంటొతుండు' వంటి విలక్షణమైన జానపద గీతాలతో, తన అద్భుతమైన నృత్యంతో యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూస్ సొంతం చేసుకున్న ప్రముఖ ఫోక్ సింగర్, డాన్సర్ నాగదుర్గ టాలీవుడ్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తన మార్కు జానపద నృత్యాలతో సెన్సేషన్ సృష్టించిన ఈ తెలంగాణ జానపద కళాకారిణి, ఇప్పుడు ఏకంగా సిల్వర్ స్క్రీన్ పై హీరోయిన్‌గా అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రముఖ క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కి చెందిన 'సుకుమార్ రైటింగ్స్' మరియు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ కి చెందిన 'బన్నీ వాస్ ప్రొడక్షన్స్' సంయుక్తంగా నిర్మిస్తున్న ఒక క్రేజీ ప్రాజెక్టులో నాగదుర్గకు హీరోయిన్‌గా లక్కీ ఛాన్స్ దక్కింది. ఈ సినిమాలో హీరోగా వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి నటించబోతున్నాడు. ఈ సినిమాతో వంశీ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే 'కలివి వనం' అనే ఓ విలక్షణమైన చిత్రంలో నటించిన నాగదుర్గ, ఆ తర్వాత తమిళంలోనూ ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో నటించింది. ఇప్పుడు టాలీవుడ్ లోని మోస్ట్ సక్సెస్‌ఫుల్ బ్యానర్ల నిర్మాణంలో, ప్రియదర్శి సరసన లీడ్ రోల్ పొంది ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. నాగదుర్గ పల్లెటూరి నైపథ్యం, ఆమె సహజ సిద్ధమైన నటన, హావభావాలు ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయని తెలుస్తోంది.తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కబోతున్నట్లు సమాచారం.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737